పులివెందుల ఎన్నిక.. ఏకపక్షం కాదు..!

జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 12న ఎన్నిక జరగనుంది. కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారిగా జిల్లాలో ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కావడంతో వీటిపై రాష్ట్రమంతటా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా పులివెందుల ఎన్నిక హైప్ క్రియేట్ చేస్తోంది. ఈసారి ఈ ఎన్నిక వైఎస్ కుటుంబానికి ఏకపక్షం కాదని అంటున్నారు. అందుకు తగ్గట్లుగానే టీడీపీ, వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నువ్వా, నేనా అంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ముఖ్యనేతలంతా ఇక్కడే తిష్ఠ వేశారు.



● హోరాహోరీగా ప్రచారాలు ● టీడీపీ, వైసీపీ మధ్యే పోటీ ● ముఖ్య నేతలంతా అక్కడే తిష్ఠ



(కడప-ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గమంటే వైఎస్ కుటుంబానికి కంచుకోట అని చెబుతుంటారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 1978లో రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పటినుంచి వైఎస్ కుటుంబాన్ని పులివెందుల నియోజకవర్గం ఆదరిస్తూ వస్తోంది. ఇక్కడ ప్రతి ఎన్నికా హింసాత్మకంగా సాగుతోందనే విషయం చరిత్ర చూస్తే తెలుస్తుంది. అయితే పులివెందుల నియోజకవర్గంలో ప్రజలు కూడా టీడీపీని ఆదరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే నచ్చిన పార్టీకి ఓటుతో తీర్పు చెబుతామని పులివెందుల నియోజకవర్గ ప్రజలు గతంలో నిరూపించారు. 1983లో టీడీపీ ఆవిర్భవించిన తరువాత ఆ పార్టీకి కూడా నియోజకవర్గంలో చెక్కుచెదరని ఓటు బ్యాంకు ఉంది. దివంగత వైఎస్, జగన్ సునామీలో కూడా ఆ పార్టీ ఓటు బ్యాంకు అలాగే కనిపిస్తూ వచ్చింది. ఇప్పుడు పులివెందులలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో మళ్లీ పులివెందులపై రాజకీయ చర్చ నడుస్తోంది.

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 12న ఉప ఎన్నికలు జరగనున్నాయి. పులవెందులలో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి, వైసీపీ నుంచి హేమంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. వైఎస్ కుటుంబం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇక్కడ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలన్నా కత్తిమీద సాముగా ఉన్నట్లు చెబుతారు. జగన్ హయాంలో నామినేషన్లు వేసే సమయంలోనే రణరంగంగా మారింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అందరూ స్వేచ్ఛగా నామినేషన్లు వేశారు. 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

పులివెందుల రసవత్తరం

పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ కుటుంబాన్ని జనం ఆదరిస్తూ వస్తున్నప్పటికీ లోకల్‌బాడీలో టీడీపీ అభ్యర్థులను కూడా ఓట్లు వేసి గెలిపించుకున్నారు. 1995లో జరిగిన జడ్పీటీసీ, మండల పరిషత్ ఎన్నికల్లో వేముల, వేంపల్లె, లింగాల జడ్పీటీసీ స్థానాలను టీడీపీ గెలుచుకుంది. అలాగే వేముల, వేంపల్లె మండల పరిషత్ స్థానాలను కూడా కైవసం చేసుకుంది. ఇప్పుడు జరుగుతున్న ఉప ఎన్నికల నేపథ్యంలో వరుసగా జరుగుతున్న పరిణామాలు అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. పులివెందుల జడ్పీటీసీకి ఆరు గ్రామ పంచాయతీల పరిధిలో 10,400 ఓట్లు ఉన్నాయి. వైసీపీలో బలమైన టీడీపీ నేతలందరూ వరుసగా టీడీపీ గూటికి చేరుతున్నారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి 2,166 ఓట్లు పోలయ్యాయి. వైసీపీకి 5,955 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం ఉప ఎన్నికల నేపథ్యంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి రావడం, అధికారపార్టీ కావడంతో టీడీపీ బలపడుతూ వస్తోంది. దీంతో ఈ ఎన్నిక ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. టీడీపీ, వైసీపీ దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఎంపీ అవినాశ్‌రెడ్డి వైసీపీ గెలుపు బాధ్యతలను భుజస్కంధాలపై వేసుకున్నారు. అదే సమయంలో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఇతర టీడీపీ నేతలు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారు. ఇటీవల జరిగిన వరుస పరిణామాలతో పులివెందుల ఎన్నిక తారాస్థాయికి చేరింది. ఇది ఒకరి అడ్డా కాదు అంటూ గతంలో టీడీపీ గెలుచుకున్న వైనాన్ని గుర్తు తెచ్చుకుంటున్నారు. మొత్తానికి పులివెందుల పోరు రసవత్తరంగా మారుతోంది.

ఒంటిమిట్టలో నువ్వా నేనా..

ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు టీడీపీ, వైసీపీ నువ్వా నేనా అంటూ ముందుకు పోతున్నాయి. టీడీపీ నుంచి అద్దలూరు ముద్దుక్రిష్టారెడ్డి పోటీ చేస్తుండగా వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ వైసీపీ తమ అభ్యర్థిని ముందుగానే ఖరారు చేసింది. దీంతో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వైసీపీ నేతలు ఒక విడత ఇంటింటి ప్రచారాన్ని పూర్తిచేశారు. టీడీపీ ఆలస్యంగా అభ్యర్థిని ఖరారు చేసింది. శుక్రవారం నుంచి టీడీపీ ప్రచారం ముమ్మరం చేయనుంది. గురువారం సాయంత్రం మంత్రులు బీసీ జనార్ధనరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి ఒంటిమిట్టలో నేతలతో సమావేశమై గెలుపు వ్యూహంపై చర్చించారు. ఇక్కడ మొత్తం 24,606 ఓట్లు ఉన్నాయి. 13 గ్రామ పంచాయతీలున్నాయి. బీసీ ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక టీడీపీ మండలాన్ని ఆరు యూనిట్లుగా విభజించి నేతలకు బాధ్యతలు అప్పజెప్పింది. వైసీపీ రెండో విడత ప్రచారాన్ని మొదలు పెట్టనుంది. ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రచార బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ దగ్గరపడడంతో ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటూ ముందుకు వెళుతున్నారు.

అభ్యర్థి విజయం కోసం సమన్వయంతో కలిసి పనిచేయాలి : మంత్రి జనార్దన్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి విజయం కోసం నాయకులంతా సమన్వయంతో కలిసి పనిచేయాలని రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక హరితా హోటల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో నాయకుల మధ్య అంతర్గత విభేదాలు ఉన్నా పార్టీ నిర్ణయమే శిరోధార్యమన్నారు. విభేదాలు పక్కనబెట్టి పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని, క్షేత్రస్థాయిలో నాయకులు నిరాశ పడాల్సిన అవసరం లేదని తెలిపారు. వచ్చే నాలుగు సంవత్సరాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసే వారికి పార్టీ అవకాశం కల్పిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు 99శాతం సంక్షేమ పథకాలు అందుతున్నాయని, స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పోలింగ్ బూత్‌ల వారిగా కష్టపడి పనిచేసే నాయకుల వివరాలను పార్టీ అధిష్టానం దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళతానన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జోన్-4 ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, వైస్ చైర్మన్ రవినాయుడు, ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే శ్రేయస్కరం

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే శ్రేయస్కరమని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం రాయచోటి కలెక్టర్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ఏ విధమైన అవగాహన కల్పించారని, ఆ సమయంలో గుర్తించిన విషయాలను తెలపాలని ఐసీడీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తల్లిపాలు, ఇతర పాల వినియోగంలో వ్యత్యాసంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి తల్లి కాన్పు అయిన గంటలోపు ముర్రుపాలు తన బిడ్డకు తాగించాలని, దీనివల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎటువంటి అంటువ్యాధులు రాకుండా తోడ్పడతాయన్నారు. బిడ్డ అన్ని దశల్లోనూ ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందని, బిడ్డ మానసికంగా ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో తోడ్పడతాయని తల్లిపాలకు మించిన శక్తి ఎందులోనూ ఉండదని తెలియజేశారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూ లక్ష్మీపతి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరి, తల్లిపాల ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. అనంతరం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వారు తయారు చేసిన 'ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా' పోస్టర్స్‌ను విడుదల చేశారు.

రైతులకు అందుబాటులో యూరియా

● వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న జేడీ

ఒంటిమిట్ట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్ తెలిపారు. గురువారం మండలంలోని రాచపల్లె రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల్లోనే కాకుండా ప్రైవేటు డీలర్ల దగ్గర కూడా యూరియా అందుబాటులో ఉందన్నారు. కాంప్లెక్సు ఎరువులు, యూరియా కలిపి వేయడం వల్ల వృథా తప్ప ప్రయోజనం ఉండదన్నారు. వరిపైరుకు ఎకరాకు 90 కిలోల చొప్పున 2 సార్లు యూరియా వేస్తే సరిపోతుందని, యూరియా వాడడం వల్ల నష్టం తప్ప మొక్కకు ఉపయోగం ఉండదని, ఇది గమనించి తగినంత మోతాదులోనే వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జయలక్ష్మీ, గ్రామ ఉద్యాన సహాయకురాలు అమరావతి, వంశీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి లారీల తనిఖీ



బాలపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో బొప్పాయి కాయల లోడుతో వెళుతున్న లారీలను గురువారం సాయంత్రం జిల్లా ఉద్యానశాఖాధికారిణి సుభాషిణి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు బాలపల్లె చెక్‌పోస్టు, ప్రధానదారిలో బొప్పాయి లారీలను తనిఖీ చేసినట్లు తెలిపారు. రోజుకు ఎన్ని లారీలు వెళుతున్నాయి, ఎన్ని టన్నులు వేసుకుని వెళుతున్నారు, ఏ ప్రాంతానికి తీసుకుని వెళుతున్నారు, టన్ను ధర ఎంత ఇలా అన్ని వివరాలను సేకరించారు. బిల్లులోని వివరాలతో, లోడు వివరాలు సరిపోతున్నాయా అని మార్కెటింగ్ శాఖ వారిని అడిగి తెలుసుకున్నారు. ఎంత ధర చెల్లించారని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు, ఉద్యాన శాఖ సిబ్బంది, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అవార్డులకు నామినేషన్లు సమర్పించండి

● జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పేర్ మనాక్ అవార్డుల కొరకు అధిక సంఖ్యలో నామినేషన్లు సమర్పించి అన్నమయ్య జిల్లాను అగ్రస్థానానికి తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. రాయచోటి పట్టణంలోని డైట్ హాల్‌లో గురువారం జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి ఇన్‌స్పేర్ మనాక్ శిక్షణా కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రోత్సహించి ఎక్కువ మందితో నామినేషన్లు సమర్పించాలన్నారు. స్థానిక సమస్యలను పరిష్కారం చూపేలా ప్రాజెక్టులు రూపొందించాలని, అన్నమయ్య జిల్లాలో 3వేల ప్రాజెక్టులు లక్ష్యాన్ని చేరుకొనేందుకు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు చొరవ చూపాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మండలి విభాగం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌స్పేర్ మనాక్ అవార్డుల కొరకు 6- 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ఒక్కో పాఠశాల నుంచి గరిష్ఠంగా 7 నామినేషన్లు సమర్పించవచ్చని తెలిపారు. విద్యార్థులు సమర్పించిన నామినేషన్లను జాతీయ స్థాయిలో పరిశీలించి అత్యుత్తమ అన్వేషణాత్మక ఆలోచనలను ఇన్‌స్పేర్ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. అవార్డుకు ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ.10వేలు నగదును అందిస్తారని, వీరికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రాజెక్టుకు మేధోసంపత్తి హక్కులు ఇస్తారన్నారు. సెప్టెంబరు 15లోపు నామినేషన్ సమర్పించాలని సూచించారు. రాయచోటి డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి సైన్స్ ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ నరసింహారెడ్డి, రాజంపేట ఎంఈవో సుబ్బరాయుడు, సెక్టోరియల్ అధికారి జనార్ధన్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్లు ఆంజనేయులు, శివలక్ష్మి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ కె.సుబ్రమణ్యం

డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

● స్కూల్‌బస్సు కింద పడి నర్సరీ విద్యార్థి మృతి



మృతిచెందిన దివాకర్

నిమ్మనపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యానికి స్కూల్ బస్సు కింద పడి నర్సరీ విద్యార్థి ఇడగొట్టి దివాకర్(4) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ పాత కొండసానివారిపల్లి వాసులు ఇడగొట్టి మల్లికార్జున, శ్రావణి మొదటి కుమారుడు ఇడగొట్టి దివాకర్ నిమ్మనపల్లిలోని విజయవాణి ప్రైవేటు స్కూల్‌లో నర్సరీ చదువుతున్నాడు. రోజూ పాఠశాల స్కూల్ వ్యాన్‌లో వెళ్లి తిరిగి అదే వ్యాన్‌లో ఇంటికి వెళ్లేవాడు. గురువారం సాయంత్రం స్కూల్ అయిపోగానే వ్యాన్ నుంచి విద్యార్థి దిగకముందే డ్రైవర్ రాజు నిర్లక్ష్యంగా వ్యాన్‌ను ముందుకు నడపడంతో వ్యాన్ కింద పడి ఆ చిన్నారి మృతి చెందాడు. వెంటనే కుటుంబీకులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సిబ్బంది పరిశీలించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. ముక్కుపచ్చలారని బిడ్డ మృతి చెందడంతో జీర్ణించుకోలేక కుటుంబీకులు బోరున విలపించారు. స్కూల్ బస్సుకు క్లీనర్ లేడని, డ్రైవర్ రాజు గతంలో కూడా ముగ్గురిని మినీ బస్సుతో ఢీకొన్న కేసులు నడుస్తున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లికు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● అర్ధ కిలో బంగారు, 10 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం ● ఎస్పీ



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు

కడప క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు సంవత్సరాలుగా పలు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర జిల్లా దొంగలను ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి అర్ధ కిలో బంగారు నగలతో పాటు 10కిలోల వెండి వస్తువులు, నాటుతుపాకీ, ఎర్రచందనం దుంగలు ఉన్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం, మైదుకూరు సీఐ రమణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన మేరకు..

అట్లూరు మండలం చెలంగారిపల్లెకు చెందిన గుమ్మిళ్ల వెంకటసుబ్బయ్య బద్వేలు టౌన్‌లో నివాసం ఉంటు న్నాడు. ఇతడిపై 28 ఎర్రచందనం కేసులతో పాటు 38 దొంగ తనాల కేసులు ఉన్నాయి. గతంలో ఇతను పీడీ యాక్టుపై జైలుకు వెళ్లాడు. బద్వేలు టౌన్ గౌరీశంకర్‌నగర్‌కు చెందిన నూతి వెంకటసుబ్బయ్య కొన్నిసంవత్సరాలుగా దొంగతనాలతో పాటు ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇతనిపై ఒక ఎర్రచందనం కేసు ఉంది. వీరిద్దరూ తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తారు. పగలు రెక్కీ చేసి రాత్రిపూట ఆ ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడేవారు. అయితే ఇళ్లల్లో తక్కువ మొత్తం బంగారు దొరుకుతుండటంతో బంగారు దుకాణాలలో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. కడప, అన్నమయ్య, సత్యసాయి, నెల్లూరు, కాకినాడ జిల్లాల్లో గతంలో బంగారు దుకాణాల్లో వీరు దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లివచ్చారు. వీరు లంకమల్ల అడవుల్లోకి వెళ్లి నాటుతుపాకీతో జంతువుల వేటకు వెళుతుంటారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో..

మైదుకూరు పోలీస్ డివిజన్‌లో చోరీలు ఎక్కువగా జరుగుతుండడంతో డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. గోపవరం మండలం పీపీకుంట సమీపంలో చెలిమికుంట అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు నరికి రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో దాడులు చేసి నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి బొలెరో వాహనం, 4 ఎర్రచందనం దుంగలతో పాటు నాటుతుపాకీ స్వాధీనం చేసుకున్నారు.. వీరిని విచారిం చడంతో 2023 సెప్టెంబరులో పోరుమామిళ్ల పరిధిలో రెండు దొంగతనాలు, టేకూరుపేటలో ఒకటి, పోరుమామిళ్ల సుందరయ్యకాలనీలో ఒకటి, గతేడాది ఫిబ్రవరి, జూలై, ఆగస్టులో మైదుకూరు పరిధిలో జీవీ సత్రం, యల్లంపల్లె, మైదుకూరు టౌన్, అలాగే ఫిబ్రవరి నెలలో బద్వేలులో రెండు, కలసపాడు, దువ్వూరు, కాశినాయన మండలం, ఖాజీపేటలో వీరు దొంగ లించిన బంగారు నగలు, వెండి వస్తువులను గుంత తీసి పాతిపెట్టినట్లు ఒప్పుకున్నారు. అలాగే ఈ ఏడాదిలో గుంటూ రు పాతబస్టాండు వద్ద ఓ బైకును దొంగతనం చేసి దానిపైనే వీరు రెక్కీ నిర్వహిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరి నుంచి అర్ధ కిలో బంగారు నగలతో పాటు పది కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామని వీటివిలువ రూ. 60లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఇద్దరు దొంగలను రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు. అంతరజిల్లా దొంగ లను అరెస్టు చేయడంలో కీలక పాత్ర వహించిన వారిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, చిత్రంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐలు తదితరులు

వాన నీటికి దారేదీ..?

● మోరీలకు మూత.. తారు రోడ్లకు కోత
● రైతుల చేష్టలతో రోడ్డు ధ్వంసం
● అటు వైపు చూడని రోడ్లు, భవనాలశాఖ

6

బైకు నుంచి కిందపడ్డ మహిళ

● పరిస్థితి విషమం ● తిరుపతి రూయాకు తరలింపు


తీవ్రంగా గాయపడ్డ శాంతమ్మ

ములకలచెరువు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహన చక్రంలో చీర ఇరుక్కుని ఓ మహిళ కింద పడ్డ సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో మహిళ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువుకు చెందిన పెయింటర్ వెంకటరమణ భార్య శాంతమ్మ(45)కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తన కుమారుడు వెంట ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చి ఆస్పత్రిలో చూపించుకుంది. తిరిగి ములకలచెరువుకు వస్తుండగా మార్గం మధ్యంలోని వేపూరికోట వద్దకు రాగానే వెనుక కూర్చున్న శాంతమ్మ చీర కొంగు బైక్ వెనుక చక్రంలో చుట్టుకుని కింద పడింది. ఈ ప్రమాదంలో శాంతమ్మ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు తిరుపతి రూయాకు రెఫర్ చేశారు.

కోమటివాని చెరువులో పడి వృద్ధుడు..


మద్దిరెడ్డి (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 7: కోమటివాని చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కురబకోట మండలం, తుగువారిపల్లె వాసి వెంకటరెడ్డి కుమారుడు మద్దిరెడ్డి (70) సర్కార్‌తోపులో ఉంటూ బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు సమీప బంధువులు వెదికినా ప్రయోజనం లేదు. కాగా వృద్ధుడు కోమటి వాని చెరువులో పడ్డాడు. దీన్ని గమనించిన పలువురు యువకులు ఆయనను బయటికి తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మదనపల్లె టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య వసంతమ్మ ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ శంకర్(51) మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఈ నెల 3న బండారువారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లె మండలం, వేంపల్లె హరిజనవాడ వాసి శంకర్ గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య


ఈశ్వర్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిబండ గ్రామం కొల్లవాండ్ల పల్లెకు చెందిన ఈశ్వర్‌రెడ్డి (38) పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మద్యం మత్తుకు బానిసైన అతను కడుపునొప్పి భరించలేక గురు వారం ఉదయం 8 గంటలకు ఆత్మహత్యాయత్నం చేసిన ఆయనను కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు..


సబిహాభాను (ఫైల్ ఫొటో)

నిమ్మనపల్లి ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై భర్త సయ్యద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక నిమ్మనపల్లి పంచాయతీ తవళం రోడ్డుకు చెందిన సయ్యద్ ఖాన్ భార్య సబిహాభాను(22) ఇంటి వద్ద వుంటూ కుటుంబాన్ని చూసుకునేది. అయితే తాను స్థానికంగా కొయ్యలమండీ వద్ద పనులకు వెళ్లగా బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిం దని భర్త ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు ప్రభుత్వ న్యాయవాదుల తొలగింపు

కలికిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని వివిధ కోర్టుల్లో ప్రభుత్వ న్యాయవాదులుగా పనిచేస్తున్న ముగ్గురు సేవలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టులో ప్రభుత్వ న్యాయవాది (జీపీ)గా పనిచేస్తున్న పి.శివశంకర్ రెడ్డిని తొలగించింది. జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా పనిచేస్తున్న షేక్ జాకీర్ హుస్సేన్‌కు కూడా ప్రభుత్వం ఉద్వాసన చెప్పింది. బద్వేలులో వున్న రాజంపేట ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా పనిచేస్తున్న ఊరుబిండి సూర్యనారాయణ రెడ్డి సేవలను కూడా ప్రభుత్వం ఉపసంహరించింది. ఈ ముగ్గురి సేవలను పాలనాపరమైన సౌలభ్యత కోసం ఉపసంహరించాలని నిర్ణయించినట్లు విడివిడిగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

వాన నీటికి దారేదీ..?

● మోరీలకు మూత.. తారు రోడ్లకు కోత

● పొలాల వెంట గట్ల నిర్మాణం

● రైతుల చేష్టలతో రోడ్డు ధ్వంసం

● అటు వైపు చూడని రోడ్లు, భవనాలశాఖ

పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాలశాఖ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన, తదితర పథకాల కింద, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశారు. ఇందుకు రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టారు. అంతవరకూ బాగానే ఉన్నా.. తర్వాత ఆయాశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రోడ్ల పర్యవేక్షణ మరిచిపోతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న రైతులు కొందరు తమ భూమిని, పంటలను పరిరక్షించుకునే క్రమంలో వర్షపునీటికి అడ్డుకట్ట వేస్తూ, దారి మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో పొలాల వెంట నిర్మించిన బ్రిడ్జిలు, మోరీ(కల్వర్టు)లను మూసేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పల్లెలకు వెళ్లే రహదారుల్లో ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.


రోడ్డు వెంబడి మట్టితో నిర్మించిన గట్టు

మదనపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మట్టిరోడ్డయినా.. మెటల్ రోడ్డయినా.. చివరకు తారురోడ్డు అయినా.. నిర్మాణంలో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. కొత్తగా రోడ్డు నిర్మాణం ప్రతిపాదన సమయంలోనే కొలతలు, లెవలింగ్ తీసి ఎలా నిర్మించాలో నిర్ణయిస్తారు. ఇందులో భాగంగా వంకలు, వాగులు, కొండలు, గుట్టలు, పైప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటిని దారి మళ్లించే ఏర్పాటు చేస్తారు. ఈ క్రమంలో అన్నింటినీ తప్పిస్తూ, అవసరమైన చోట బ్రిడ్జిలు, మోరీ(కల్వర్టు), ఏట వాలు ప్రాంతంలో రెయిలింగ్ గోడ, రోడ్డుకు అటు, ఇటు వర్షపు నీరు వెళ్లేలా కాలువలు, అవి కోతకు గురికాకుండా రాళ్ల రివిట్‌మెంట్ పనులు చేపడ తారు. ఏ రకం రోడ్డు అయినా సరే.. ఈ చర్యలు తప్పనిసరి. పై ప్రాంతం నుంచి నుంచి తరచూ వర్షపు నీరు వస్తుందనుకుంటే అక్కడ రోడ్డు కోతకాకుండా ఉండేందుకు సిమెంటు రోడ్డు కూడా వేస్తారు.


దిగువ మిట్టామర్రి వద్ద రోడ్డు పక్కన మట్టితో కాలువను పూడ్చేసిన దృశ్యం

రోడ్లపైకి నీరు రావడంతో ప్రమాదాలు

పై ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు సులువుగా వెళ్లేందుకు రోడ్డు వెంబడి కాలువ, డైవర్షన్ నిర్మించారు. ఆ నీరు పొలాల్లోకి రాకుండా రైతులు ఎక్కడిక్కడ అడ్డుకట్ట వేసేశారు. మోరీలు మూసేశారు. కాలువలు ధ్వంసం చేసేశారు. వాటిని మట్టితో కప్పేశారు. తర్వాత రోడ్డు పొడవునా అంచుల్లో పొడవునా మట్టికట్ట నిర్మించారు. ఒకరు ఓ వైపు నిర్మిస్తే, అటు వైపు ఉన్న రైతు తానేమీ తక్కువ తిన్నానా అన్నట్లు అంతకంటే ఇంకొంచెం ఎత్తుగా మట్టికట్టలు పోసి, వర్షపునీరు పొలంలోకి రాకుండా ఎవరిపాటికి వారు దారి మళ్లించారు. ఫలితంగా ఆ నీరంతా రోడ్డు వెంబడి ప్రవహిస్తూ, రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి, వర్షపునీరు నిల్వ చేరడంతో పైప్రాంతాలకు వెళ్లాల్సిన ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పొలంలోని మట్టి, రాళ్ల రోడ్డుపైకి వచ్చి వాహన టైర్లు పంక్చర్ కావడమే కాదు.. తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

చాలా గ్రామాల్లో రోడ్లు ధ్వంసం

ఇలాంటి దృష్టాంతాలు మదనపల్లె, కురబకోట ఏరియాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. మదనపల్లె మండలం పొన్నేటిపాళెం, కోళ్లబైలు, కురబలకోట మండలం తెట్టు, అంగళ్లు, తదితర గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. కోళ్లబైలు పంచాయతీలోని సవరంవారిపల్లె, ఎగువ మిట్టామర్రి, దిగువ మిట్టామర్రి, మామిడిగుంతలపల్లె, మేకలవాండ్లపల్లె, వలసపల్లె, కోటవారిపల్లె పంచాయతీలోని బండకిందపల్లె, అడవిలోపల్లె, బొమ్మనచెరువు, టీకులపాళెం, పెంచుపాడు, మాలేపాడు బి.కొత్తకోట మండలంలోని మొటుకుపల్లె మార్గాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. వీటిలో ముఖ్యంగా రోడ్లు, భవనాలశాఖ రోడ్లే ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యపై పై ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. రోడ్లు వేయడం వరకే తమ పని అనే రీతిలో వ్యవహరిస్తున్నారు రోడ్లు భవనాలశాఖ అధికారులు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు పక్కన విలువైన స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా..రోడ్డు కబ్జాకు గురవుతున్నా.. ఆశాఖ నిద్రమత్తు వీడటం లేదు. తమకెందుకులే అదంతా రెవెన్యూశాఖ చూసుకుంటుందన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు.

వారం రోజుల్లో క్లియర్ చేస్తాం

- అరవిందదేవి, ఈఈ, రోడ్డు భవనాల శాఖ, మదనపల్లె

కోళ్లబైలు మార్గంలోని మేకలవారిపల్లె, మిటమర్రి రద్దు మార్గాలను పరిశీలిస్తాం. రోడ్డు వెంబడి వర్షపు నీటికి అడ్డంగా వేసిన మట్టి కట్టలను తొలగిస్తాం. మూసేసిన మోరీలను కూడా వారం రోజుల్లో క్లియర్ చేసి వర్షపు నీరు యథావిధిగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.


సవరంవారిపల్లె వద్ద పొలంలో మూతపడిన కల్వర్టు

టన్ను రూ.9 వేలకు తక్కువ చెల్లిస్తే చర్యలు

● బొప్పాయి దళారులకు సబ్‌కలెక్టర్ హెచ్చరిక

రైల్వేకోడూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బొప్పాయికాయలు టన్నుకు రూ.9,000లకు తక్కువ చెల్లిస్తే చర్యలు తప్పవని రాజంపేట సబ్ కలెక్టర్ భావన బొప్పాయి దళారులను హెచ్చరించారు. గురువారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో మరోసారి బొప్పాయి రైతులు, దళారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను తప్పకుండా పాటించాలన్నారు. వ్యాపారం పుంజుకుంటే ధర పెంచుకుంటూ పోవాలని తెలిపారు. టన్ను రూ.8,000లతో కొనుగోలు చేసిన దళారులపై చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని చెక్‌పోస్టుల వద్ద ఉద్యాన, రెవెన్యూ అధికారులు, పోలీసులు బొప్పాయి లారీలపై నిఘా ఉంచారని తెలిపారు. టన్ను రూ.8,000లకు తక్కువ చెల్లించిన లారీలను పట్టుకుని సీజ్ చేస్తామని తెలిపారు. ఈ నెల 15 వరకు టన్నుకు రూ.9,000లు చెల్లించాలని ఆదేశించారు. ఏఎస్పీ రామనాథ్‌హెగ్డే మాట్లాడుతూ బొప్పాయి రైతులను ఇబ్బంది పెట్టకుండా ఉండాలన్నారు. కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, మార్కెటింగ్ శాఖ అధికారులు బాబు, మనోజ్, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

బొప్పాయి ధరలపై ఉద్యానశాఖ ఆరా

రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో బుధవారం ధరలు తగ్గించారని రైతులు అధికారులకు విన్నవించడంతో గురువారం ఉద్యానశాఖ అధికారులు, అసిస్టెంట్లు తదితరులు పరిశీలించారు. బొప్పాయి లారీలు పెట్టిన ప్రతి తోట దగ్గరకు వెళ్లి ఎంత ధర చెల్లించారు, దళారీ ఎవరు, మార్వాడీ ఎవరన్న అంశాలను ఆరా తీశారని ఉద్యానశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద నిఘా పెట్టారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట సబ్ కలెక్టర్ భావన

ఏడాది పాలనలో సంతృప్తి : సబ్ కలెక్టర్

మదనపల్లెటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేరు ప్రఖ్యాతలు పొందిన మదనపల్లె రెవెన్యూ సబ్‌డివిజన్‌లో ఏడాది పాటు విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తి ఇచ్చిందని సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ చెప్పారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో మదనపల్లె రూరల్, తాలూకా, టూటౌన్ సీఐలు సబ్‌కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మదనపల్లెలో తన ఏడాది పాలనపై ఇలా వివరించారు. 2024 జూలై 26న మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న రోజుకు ముందే సబ్‌కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం జరిగిందన్నారు. అటువంటి వాతావారణంలో విధుల్లోకి చేరినప్పుడు రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరి ఆర్‌పీ సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంతో తోడ్పాటు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి కాలిపోయిన భవనాలను పునర్‌నిర్మిం చడం, కాలిపోయిన ఫైళ్లను ఆయా మండలాల నుంచి రికవరీ చర్యలను ఒక యజ్ఞంలో నిర్వహించానన్నారు. సీఎం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా 5,540 అర్జీలను విచారించి అందులో 5,140 దాకా అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. ఇక పోతే మదనపల్లెలో బక్రీద్, వినాయక చవితి పండుగల సందర్భంగా శాంతి కమిటీ సమా వేశాలు నిర్వహించి, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టా మన్నారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో వున్న 23 మంది వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించానన్నారు. విధుల నిర్వహణలో రాజీపడకుండా తప్పులు చేసిన రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టానన్నారు. ముఖ్యంగా మ్యుటేషన్లను మంజూరు చేయడంలో వేగవంతంగా పని చేశానన్నారు.


బదిలీపై వెళుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ మహేంద్ర, సీఐలు

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడు అరెస్టు

పెద్దమండ్యం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లి ఏడీజే కోర్టులో నడుస్తున్న చెక్‌బౌన్స్ కేసులో నిందితుడుగా ఉన్న చౌడేపల్లి అసిస్టెంట్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న షఫీక్ అహ్మద్‌ను పుంగనూరులో గురువారం పెద్దమండ్యం పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లి 2టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ అనంతరం నిందితుడిని మదనపల్లి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు. పెద్దమండ్యం పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఆయన చౌడేపల్లికు బదిలీ అయ్యారు. పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో షఫీక్ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పిడుగు పాటుకు రేకుల ఇల్లు ధ్వంసం


ధ్వంసమైన రేకుల ఇల్లు

నిమ్మనపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బండమీద హరిజనవాడలో కె.వెంకటరమణ ఇంటిపై గురువారం ఉదయం కురిసిన వర్షానికి పెద్ద శబ్ధంతో పిడుగు పడింది. దీంతో ఇంటిపైకప్పు, ఇంట్లో వున్న సామగ్రి ధ్వంసమయ్యాయి. కుటుంబీకులు వెంకటరమణ, భార్య సరోజమ్మ ఇంటి బయట ఆవులను కట్టేసేందుకు వెళ్లారు. దీంతో వారికి ఎలాంటి ఇబ్బంది కలగలేదు. పైగా గ్రామంలో వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తెగిపడింది. గ్రామంలోని పలు ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టంపై అంచనా వేశారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్ బాష తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదన పల్లె పట్టణం, శెట్టివారివీధి వాసి స్వప్న, రమేశ్‌ల కుమార్తె వైష్ణవి నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడాకారులకు రూ.లక్ష చేయూత


ఆర్థిక సహాయం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫుడ్‌బాల్ పోటీలకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులకు అన్నమయ్య జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆర్థికంగా చేయూత ఇచ్చింది. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ చేతుల మీదుగా రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరసింహనాయుడు, ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎం బాబ్జి కలసి రూ.లక్ష చెక్కును ఇద్దరు క్రీడాకారులకు అందజేశారు. ఇండోనేషియాలో ఈ నెల 15న నిర్వహించే పోటీలకు వెళ్లనున్న ఫుడ్‌బాల్ క్రీడాకారులు కె.కెన్నెత్, సి.సతీష్‌లు రెవెన్యూ అసోసియేషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో చైతన్య అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గురువారం స్కూటర్‌పై చౌటపల్లి నుంచి లక్కిరెడ్డిపల్లెకు వెళుతుండగా, మార్గమధ్యంలోని మర్రిచెట్టు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

చేపల వేలానికి 'ఆధిపత్య పోరు'

● వేలం నిర్వహించరాదని గ్రామస్థుల పట్టు ● ఉద్రిక్తతల నడుమ ఎట్టకేలకు వాయిదా వేసిన అధికారులు


రాపూరివాండ్లపల్లె సచివాలయం వద్ద వేలం పాటలను వాయిదా వేస్తున్న పంచాయతీ అధికారులు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం రంగరాయ చెరువు చేపల వేలంపాటలు తీవ్ర ఉద్రిక్తతల నడుమ అధికారులు వాయిదా వేశారు. గురువారం స్థానిక రాపూరివాండ్లపల్లె సచివాలయ ఆవరణలో చేపల చెరువు వేలం పాటలను నిర్వహించేందుకు ఈఓపీఆర్డీ మోహన్‌ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి ఎర్రమల్లయ్య నాయుడు ఏర్పాట్లు చేశారు. వేలం నిర్వహణకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సరిగ్గా ఉదయం 11 గంటలకు గ్రామస్తులు పెద్దఎత్తున వేలం ప్రదేశానికి చేరుకున్నారు. పంచాయతీ అధికారులు వేలంలో పాల్గొనే వారి నుంచి ధరావత్తు సొమ్మును వసూలు చేశారు. అయితే గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ వేలం నిర్వహించరాదని ఈఓపీఆర్డీకి గ్రామస్తులు మూకుమ్మడిగా వినతి పత్రం సమర్పించారు. ఒకానొక సమయంలో గ్రామస్తులు అధికారుల నడుమ వాదోపవాదాలు జరిగాయి. ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని గ్రామస్తులను శాంతింపచేశారు. అనంతరం ఈఓపీఆర్డీ మాట్లాడుతూ పంచాయతీ ఆస్తులపై పంచాయతీ అధికారులకు పూర్తి హక్కు ఉంటుందని, పంచాయతీ అధికారుల నిర్ణయాన్ని గ్రామస్తులు ఆమోదించాలని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ చెరువులో నీళ్ల తక్కువ మట్టంలో ఉన్నాయని, అలాంటప్పుడు మీరు ఎలా వేలం నిర్వహిస్తారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు తాగునీటికి జీవనాధరమైన చెరువులో నీళ్ల వదిలేసి వారు చేపలను పట్టుకుంటే మా పరిస్థితి ఏమిటని అధికారులను నిలదీశారు. గతంలో వేలం పాడిన గుత్తేదారులు వలల ద్వారా చేపలు పట్టకుండా రసాయన మందులు ఉపయోగించి చేపలను పట్టడం వలన చెరువులో నీరు పూర్తిగా కలుషితమైందన్నారు. దీంతో ఆ నీటిని మూగజీవాలు నీటిని సైతం తాగడం లేదన్నారు. ఆ రసాయనాల వలన పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ప్రజలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడ్డారు. దీంతో అధికారులు ఎట్టకేలకు వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి వేలం నిర్వహణ తేదీని ప్రకటించి వేలం నిర్వహిస్తామని తెలియచేయడంతో గ్రామస్తులు వెనుదిరిగారు. వేలం పాట నిర్వహణలో ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మొలకలచెరువు సీఐ లక్ష్మన్న, పీటీఎం ఎస్ఐ హరిహరప్రసాద్ ముగ్గురు ఎస్ఐలు, 15 మంది కానిస్టేబుల్, ఇద్దరు ఏఎస్ఐలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పీలేరుపై 'జల'కుట్ర !

● గార్గేయ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

● పోలీసులకు ఫిర్యాదు చేసే యోజనలో అధికారులు, టీడీపీ నేతలు


తూమును పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

పీలేరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణ దాహార్తి తీర్చేందుకు నిర్మించిన గార్గేయ ప్రాజెక్టు(బాలంవారిపల్లె ప్రాజెక్టు) నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నీటిని దిగువకు విడుదల చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పీలేరు పంచాయతీకి నీటి పంపింగ్ చేసేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో జరిగిన ఈ సంఘటనతో అటు అధికారులు, ఇటు స్థానిక టీడీపీ నేతలు షాక్‌కు గురయ్యారు. ప్రస్తుతానికి నిండు కుండను తలపిస్తున్న ప్రాజెక్టులోని నీటిని దిగువకు విడుదల చేస్తే నీరు డెడ్ స్టోరేజ్‌కు చేరుకుంటుందన్న కారణంగా పంపింగ్‌ను నిలిపేయవచ్చనే చెడు ఆలోచనతోనే నీటిని విడుదల చేసి ఉంటారని అధికారులు, టీడీపీ నేతలు అనుమానిస్తున్నారు. ప్రాజెక్టులో సుమారు 6 అడుగుల మేర నీరు తగ్గిపోయిందని, ఆ నీటిని సుమారు ఏడాదిపాటు పీలేరు ప్రజలకు సరఫరా చేసి ఉండవచ్చని పంచాయతీ వాటర్ వర్క్స్ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనా వేస్తున్నారు. కేవలం రాజకీయ కారణాలతోనే ప్రాజెక్టు సమీప గ్రామాలకు చెందిన కొందరు వైసీపీ నేతలు ఈ పనికి సిద్ధపడ్డారని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

ఇది వైసీపీ కుట్రే : టీడీపీ నేతలు

ప్రాజెక్టు నుంచి నీటిని కిందికి వదిలేసిన ఘటనలో కుట్ర కోణం ఉందంటూ పీలేరు టీడీపీ నేతలు అనుమానిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాను అడ్డుకుని పట్టణంలో నీటి ఎద్దడి సృష్టించి ప్రజల ముందు ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టేందుకు వైసీపీ నేతలు కుట్ర పన్నారని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా పీలేరు పట్టణానికి తాగునీరు అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు అమరనాథరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి పేర్కొన్నారు.



చాపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

'కుందూ'లో నీటి పరవళ్లు

గత వారం రోజుల నుంచి కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పైతట్టు ప్రాంతాలలో పడిన వర్షాలతో నదిలో నీరు పరుగులు పెడుతోంది. నదిలోని నీటి పరవళ్లు చూపరులను అలరిస్తున్నాయి. ఇక నదీ తీరం వెంబడి ఉన్న గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగుకు పుష్కలంగా నీరు లభిస్తుందని సంతోషంగా ఉన్నారు. ఇప్పటికే చాపాడు, దువ్వూరు మండలాల్లో నదీ పరివాహక గ్రామాల రైతులు వరిపైరు సాగు చేసేందుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు.
(చాపాడు/దువ్వూరు, ఆంధ్రజ్యోతి)



కామనూరు బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతున్న నీళ్లు

పూర్తి భద్రత మధ్య జడ్పీటీసీ ఎన్నికలు

- ఇప్పటి వరకు 120 మందిపై కేసు నమోదు
- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్టలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలు కట్టుదిట్ట భద్రత మధ్య నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. కడప పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్టలో 12న ఎన్నికలు జరుగుతున్నాయని, 14న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఇప్పటికే కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామన్నారు. అయినప్పటికీ రెండు సంఘటనలు జరిగాయి. సభ్యులు వారికి కేటాయించిన గ్రామాల్లో మాత్రమే ప్రచారం చేయాలన్నారు. అలాకాకుండా అనధికారికంగా వేరే గ్రామాలకు వెళ్లి ప్రచారం చేయడం సరికాదన్నారు. వేల్పుల గ్రామంలో నాగేంద్ర అనే వ్యక్తి వైసీపీ నుంచి టీడీపీకి రావడం జరిగిందని.. ఈ క్రమంలో ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలు నాగేంద్ర ఇంటికి వెళ్లిన సందర్భంలో ఇరువర్గాలు గొడవ పడి ఒకరి మీద ఒకరు కేసులు పెట్టుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించి పులివెందుల, ఒంటిమిట్టలో ఇప్పటి వరకు 120 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ని ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని, లేదంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మొబైల్, పెట్రోలింగ్ పార్టీస్, స్ట్రైకింగ్ ఫోర్సెస్‌తో భద్రత ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సుమారు 600 మందితో 12వ తేదీ ఎన్నికల సమయంలో భద్రత కల్పిస్తున్నామన్నారు. సీసీ కెమెరాలు, రిజర్వు ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. డ్రోన్లద్వారా కూడా పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఎవరు కూడా హోటల్స్, లాడ్జిలలో ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గండికోటలో జరిగిన విద్యార్థిని హత్యకు సంబంధించి మాట్లాడుతూ ఇంకా ఎవిడెన్స్ సేకరణ జరుగుతుందని టెక్నికల్‌గా పూర్తిస్థాయిలో విచారణ కొనసాగిస్తున్నామని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెం ట్ అండ్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహమ్మద్ పేర్కొన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డైరక్టరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రిటైర్ అయిన వారికి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులను వెంట నే చెల్లించాలని, పెన్షనరీ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని, పీఆర్‌సీ ఎరియర్స్, డీఆర్, ఈహెచ్ఎస్ బకాయిలను చెల్లించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగాచార్యులు, జిల్లా అధ్యక్షుడు కేశవులు, రిటైర్డ్ ఎంపీడీవోలు, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వ్యవహారాల సభ్యుడిగా తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవ హారాల సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి నియామకమయ్యారు. ఏపీసీసీ కార్యదర్శి ఠాకూర్ ఛైర్మన్‌గా 24 మంది సభ్యులున్న కమిటీలో తులసిరెడ్డిని నియమించడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం తులసిరెడ్డిని శాలువ, పూలమాలలతో సత్కరించారు.

దాడిలో ఏడుగురికి గాయాలు

ఖాజీపేట, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుడుములదిన్నె దళితవాడలో గురువారం రాత్రి ఇరువర్గాల ఘర్షణలో ఏడుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే రోడ్డుకు అడ్డంగా ఆటో నిలిపారంటూ చెన్నయ్య, ప్రసన్నకుమార్ అనే ఇరువురు ఘర్షణపడి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈదాడిలో చెన్నయ్యతో పాటు మరో ముగ్గురికి, ప్రసన్నకుమార్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చాపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబవరం శివ(28) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. జమ్మలమడుగు మండలం దేవగుడికి చెందిన శివ ట్రాక్టర్‌లో రాళ్లను రాజంపేటకు తీసుకెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెట్టుకు ఉరివేసుకొని రైతు ఆత్మహత్య



మైదుకూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యల్లంపల్లె గ్రామానికి చెందిన మూలే ఇంద్రసేనారెడ్డి (41) అనే రైతు గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని యల్లంపల్లెకు చెందిన ఇంద్రసేనారెడ్డి గురువారం తన భార్యతో కలిసి పశువులకు గడ్డి మేత కోసం పొలానికి వెళ్లారు. భార్య గడ్డి కోస్తుండగా పొలంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, రైతు ఇంద్రసేనారెడ్డి తన సొంత భూమి నాలుగు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసేవాడు. పంటలు సక్రమంగా పండకపోవడంతో అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సోలార్ ఫెన్సింగ్ తగిలి వ్యక్తి మృతి



పోరుమామిళ్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సోలార్ ఫెన్సింగ్ తగలి షాక్‌కు గురై మీసాల వెంకటేశ్ (49) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. ఖాజీపేట మండలానికి చెందిన వెంకటేశ్ 25 ఏళ్ల క్రితం బొప్పాపురం వచ్చి స్థిరపడ్డాడు. కూలీ పను లు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గురు వారం చెన్నారెడ్డిపేట గ్రామ పొలాల్లో సిద్దు శివారెడ్డి పొలం లో నీళ్లు కట్టేందుకు వెళ్లి.. ఆ పక్కనే ఉన్న గుర్విరెడ్డి పొలా నికి వేసిన సోలార్‌ఫెన్సింగ్ తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, తరుణ్‌కుమార్ అనే కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

మహిళ ఆత్మహత్య

జమ్మలమడుగు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడి గ్రామంలో గురువారం తలారి రేవతిదేవి (40) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె గత కొంత కాలంగా అనారోగ్యంతో మానసికంగా బాధపడుతుండేది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుంది. సమాచారం తెలిసిన జమ్మలమడుగు అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హైమావతి తెలిపారు.

అద్దెకు దిగి బంగారం, నగదుతో పరార్



దొంగతనం కేసులో నిందితులు నిలుచున్న వారు (ఫైల్)

లింగాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో పథకం ప్రకారం ఓ ఇంట్లో అద్దెకు దిగి బంగారు, నగదుతో భార్య భర్త పరారయ్యారు. పార్నపల్లె గ్రామానికి చెందిన కమతం రాధా ఆరు నెలల క్రితం అనంతపురానికి చెందిన మా బాష, హసీనాలకు అద్దెకు తన ఇంటిని ఇచ్చింది. మాబాష అరటికాయల లోడింగ్ పనికి వెళ్లేవాడు. అయితే బుధవారం రాధ తోటవద్దకు వెళ్లిన తర్వాత మా బాష రాధా ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి రూ.1.10 లక్షల నగదు, 9 గ్రాముల బంగారం, కాళ్ల పట్టీలు దొంగిలించి పరారయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పట్టపగలే చోరీకి యత్నం

- దొంగతో పోరాడి పట్టుకున్న ఇంటి యజమాని
- తలకు తీవ్ర గాయాలు



దొంగ చేతిలో తీవ్రంగా గాయపడ్డ నంద్యాల వెంకటసుబ్బయ్య

రాజుపాలెం, ఆగ స్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే చోరీ చేస్తున్న దొంగ ను ఓ ఇంటి యజమాని పట్టుకున్నాడు. అయితే దొంగను పట్టుకునే సమయంలో తీవ్రంగా ప్రతిఘటించి దాడి చేయడంతో ఇంటి యజ మానికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేర కు... మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో గురు వారం మధ్యాహ్నం నంద్యాల వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించాడు. అదే సమయంలో ఇంటి యజమాని వెంకటసుబ్బయ్య రావడంతో దొంగ తప్పించుకునేందుకు చూశాడు. అయితే దొంగను పట్టుకునేందుకు యజమాని ప్రయత్నించగా దాడికి పాల్పడ్డాడు. చోరీ చేసేందుకు తెచ్చుకున్న ఉలితో తలపై విచక్షణా రహితంగా పొడవడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. అయినా యజమాని వెంకటసుబ్బయ్య దొంగను పట్టుకుని కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి దొంగకు దేహశుద్ధి చేసి తాళ్లతో కట్టి పడేశారు. తలకు తీవ్రగాయాలైన వెంకటసుబ్బయ్యను 108 వాహనంలో ప్రొద్దుటూరుకు.. అక్కడ నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడ తలకు 38 కుట్లు పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నెలరోజులుగా పట్టపగలే దొంగతనాలు

నెలరోజులుగా మండలంలో టంగుటూరు, రాజుపాలెం, గాదెగూడూరు గ్రామాల్లో పట్టపగలే దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. గ్రామంలోని ప్రజలు పంట పొలాలకు వెళుతుండడంతో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడ్డారు.



పట్టుబడిన దొంగ మహ్మద్‌రఫి



దొంగను పోలీసులకు అప్పజెబుతున్న గ్రామస్థులు

పట్టుబడిన దొంగ దువ్వూరు మండలం జిల్లెల వాసి

దువ్వూరు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన మహ్మద్‌రఫి అని, ఇతను గత కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలు చేస్తూ పట్టుబడినట్లు సమాచారం. ఇతని పై దాదాపు 20 చోట్ల దొంగతనాల కేసులు నమోదై సెంట్రల్ జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు సమాచారం. పూర్తి వివరాలు విచారించి త్వరలో వెల్లడిస్తామని ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

కలసపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలో నాలుగేళ్ల చిన్నారిపై 16 సంవత్సరాల బాలుడు అత్యాచారం చేసిన ఘటన చోటు చేసుకుంది. బాలుడు తనపక్క ఇంటిలోని చిన్నారికి మాయమాటలు చెప్పి రోజు దగ్గరకు తీసుకొని ఆడించుకునేవాడు. ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం సమయంలో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఇరుగుపొరుగువారు తల్లిదండ్రులకు తెలపడంతో బాలికను చికిత్స కోసం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై కలసపాడు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన బాలుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

దాడి ఘటనలో 10 మందిపై కేసు

కలసపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం కొండపేటలో జరిగిన దాడి ఘటనపై పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ ఆమె భర్తపై జరిగిన దాడికి సంబం ధించి పోలిరెడ్డి, చంద్రకళ, వీరమ్మ, నారాయణరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చామంతి, రమణమ్మ తదితరులపై కేసు నమోదైంది. గ్రామ కంఠంలో సర్వేనెంబర్ 11/2లో 15 సెంట్ల స్థలంపై రెవెన్యూ అధికారులతో సర్వే చేయించుకుం టుండగా తనపై తన భర్తపై దాడి చేసి కొట్టారని రాజేశ్వ రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అరటిచెట్లను నరికివేశారని...

కలసపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శంఖవరంలో కాపు దశలో ఉన్న అరటిచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారని రైతు సోమిరెడ్డి కొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు 50 అరటిచెట్లు నరికివేయడంతో రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు.

16 మద్యం బాటిళ్లు స్వాధీనం

దువ్వూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రిష్ణంపల్లె గ్రామంలో గురువారం 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బ్రాందీషాపులకు అనుబంధంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న నాగరాజు అనే వ్యక్తి దగ్గర ఈ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వైసీపీ ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తోంది : ఎమ్మెల్సీ

పులివెందుల ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో వైసీపీ గత రెండు రోజులుగా చేస్తున్న హడావుడి చూస్తే ఎన్నికల బరి నుంచి తప్పుకునేందుకు తాపత్రయం పడుతున్నట్లు స్పష్టమవుతోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పులివెందులలో ఎమ్మెల్సీ ఆయన ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండువారిపల్లెలో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడానికి కారణం వైసీపీనే అన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులు ఎన్నికల నియమావళి ప్రకారం ఇంటింటి ప్రచారం చేసుకునేందుకు ఆయా గ్రామాలను ఎప్పుడెప్పుడు ఏపార్టీ ప్రచారం చేసుకోవాలో పోలీసులు సమయాన్ని కేటాయిస్తారు. అందులో భాగంగానే బుధవారం టీడీపీ నల్లగొండువారిపల్లెలో ప్రచారం చేయాల్సి ఉంది. కానీ వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ, కొంత మంది నాయకులు నల్లగొండువారిపల్లెకు వెళ్లి మా పార్టీకి చెందిన వారితో రెచ్చగొట్టే విధంగా దురుసుగా ప్రవర్తించారన్నారు. దీంతో ఇరువర్గాలకు గాయాలయ్యాయన్నారు. అలాగే మంగళవారం సురేష్‌రెడ్డి (సైదాపురం చంటి) జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారంటే అది వైసీపీకి గానీ, టీడీపీకి గానీ ప్రత్యర్థిగానే భావించాలన్నారు. అలాంటిది టీడీపీ వారు అతనిపై దాడి చేశారనడం సరైందికాదన్నారు. సైదాపురం చంటికి గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఈ సమస్యల వలనే ఈ దాడి జరిగి ఉంటుందని స్పష్టమవుతోందన్నారు. కానీ దీన్ని కూడా టీడీపీవారే దాడి చేశారనడం ఎంత వరకు సబబు అన్నారు. రాచమల్లు ప్రసాదరెడ్డి వచ్చీ రాగానే ఓ స్క్రిప్టు ప్రకారం వ్యవహారం నడుపుతున్నారన్నారు. కావాలనే ఉద్రిక్తత పరిస్థితులు వచ్చేలా రెచ్చగొట్టే కార్యక్రమాలకు దిగుతున్నారన్నారు. ఎన్నికల కోడ్ ఉన్న వందలాది మందిని తీసుకొని ఎంపీ అవినాశ్‌రెడ్డి తదితరులు పట్టణంలో ర్యాలీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. బుధవారం రాత్రి ఇ.కొత్తపల్లెకు చెందిన బాల గంగిరెడ్డి అనే వ్యక్తి టీడీపీకి చెందిన రాజాపై దాడి చేయడం వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు.

డాక్టర్ వైఎస్సార్ వర్సిటీ ఆర్కిటెక్చర్ కోర్సుకు సీఓఏ ఆమోదం

- హామీని నెరవేర్చిన మంత్రి లోకేశ్
- విద్యార్థి సంఘాల పోరాటాల ఫలితం


కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కడప డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) 2025-26 విద్యా సంవత్సరానికి 40 మంది విద్యార్థులతో ఐదు సంవత్సరాల పూర్తి సమయం బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డిగ్రీ కోర్సును అందించడానికి ఆమోదం తెలిపింది. బుధవారం (ఆగస్టు 6వ తేదీ) కౌన్సిల్ రిజిస్ట్రార్ ఆర్‌కే ఓబెరాయ్ డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌కు ఒక ప్రకటన విడుదల చేశారు. సీఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఇటీవలి సమావేశంలో, డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం కడప సమర్పించిన సమ్మతిని సమీక్షించిందని తెలిపారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా కడపలోని సంస్థలో చేరిన 2020-21 విద్యా సెషన్‌కు 64 మంది విద్యార్థులు, 2021-22కు ఆరుగురు విద్యార్థులు, 2022-23కు 15 మంది విద్యార్థులతో కూడిన బి.ఆర్క్ బ్యాచ్‌లను గుర్తించాలని.. అలాగే సంస్థ ద్వారా గుర్తింపు పొందిన అర్హత ఉన్న విద్యార్థుల దరఖాస్తులను స్వీకరించిన తర్వాత ఆర్కిటెక్ట్‌గా నమోదు చేసుకోవాలని కమిటీ నిర్ణయించింది. నిబంధనల ప్రకారం కౌన్సిల్ సూచించిన అర్హతను నెరవేర్చడానికి లోబడి ఉంటుంది. నమోదు సంఖ్యల జారీ ప్రక్రియ కోసం ఈ విద్యార్థుల డేటాను కౌన్సిల్ వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో సమర్పించాలని కూడా సంస్థను కౌన్సిల్ కోరింది.

విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి...

కడప ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులు యూనివర్సిటీలో గుర్తింపు విషయమై ఎదుర్కొంటున్న సమస్యలపట్ల విద్యార్థి సంఘాల ఆందోళన చెందడంతో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి విషయం తెలుసుకొని శ్రీసత్యసాయి జిల్లా కొత్త చెరువు గ్రామంలో యూనివర్సిటీ విద్యా ర్థులను తీసుకెళ్లి నారా లోకేశ్‌తో మాట్లాడించడం జరిగింది. కడప ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులు తమ సమస్యలను మంత్రి కి వివరించడం జరిగింది. ఇందుకు లోకేశ్ సానుకూలంగా స్పందించి అన్ని విషయాలను సీఓఏ (కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్)తో చర్చి స్తు న్నామని విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని స్పష్టం చెప్పారు. ప్రస్తుతం మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చిందని చెప్పవచ్చు.

విద్యార్థి సంఘాల పోరాటాలతో..

డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీకి స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు సీఓఏ అనుమతి మంజూరు చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జూలై రెండో తేది నుంచి 8 రోజుల పాటు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళనలకు ఏఐఎస్ఎఫ్‌తో పాటు మరికొన్ని విద్యార్థి సంఘాలు కూడా తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఆందోళనలో భాగస్వామ్యం అయ్యాయి. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు విద్యార్థి సంఘాలు ఆందోళనలను విరమించాయి.



యూనివర్సిటీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం (ఫైల్)

పలు పార్టీల మద్దతు

విద్యార్థి సంఘాల ఆందోళనలకు పలురాకీయ పార్టీలు మద్దతును ప్రకటించాయి. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి విద్యార్థుల ఆందోళనలకు తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. అలాగే ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ పక్షాన మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విద్యార్థుల ఆందోళనలకు తమ మద్దతును తెలియజేశారు. విద్యార్థుల నిరసన కార్యక్రమంలో పాల్గొని సీఓఏ మంజూరు చేయాలంటూ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

ప్రజాప్రతినిధులు లేకుండా సమావేశాలెందుకు?

● తూతూ మంత్రంగా మండల సమావేశం ● సగానికి పైగా ప్రజా ప్రతినిధులు గైర్హాజరు
● వారి దారిలోనే అధికారులు.. ● ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ శ్రీధర్ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన ప్రజాప్రతినిధులు, వాటిని పరిష్కరించాల్సిన అధికారులు హాజరుకాని పక్షంలో మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం దండుగమారి కార్యక్రమమని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో గురువారం ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా 11.10 గంటలకు మొదలు పెట్టారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరు కాగా, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనరసయ్యతో పాటు సగం మంది ఎంపీటీసీ సభ్యులు, సగం మంది సర్పంచులు గైర్హాజరయ్యారు. పలు శాఖలకు సంబంధించిన అధికారులు సైతం హాజరు కాలేదు. ఈ సందర్భంగా ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డి అన్నిశాఖల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చివరగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి రాని అధికారుల తీరుపై మండిపడ్డారు. మూడు నెలలకు సంబంధించిన పురోగతిపై ప్రతి అధికారి సమగ్ర నివేదికలు సమర్పించాలని, భవిష్యత్తులో అవసరమైన పనులపై కచ్చితమైన సమాచారంతో రావాలని లేకుంటే సస్పెండ్ చేయిస్తామని హెచ్చరించారు. చివరగా సర్పంచ్‌లు వేదికపై ఉన్నఅధికారులు, నాయకులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గౌరీశంకర్‌రాజు, డిప్యూటీ తహసీల్దారు సుమని, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి

● జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, స్వర్ణాంధ్ర పీ4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియ ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన వాటిపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, పాస్‌బుక్ సర్వే వంటి అంశాల్లో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీపీపీ విధానంలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా కలెక్టర్లు అందరూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనలు మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల పై దాడులు

రైల్వేకోడూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల పై గురువారం రాజంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు శివ శంకర్, వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి, పవన్, కోడూరు మండల వ్యవసాయ అధికారి సందీప్ దాడులు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులకు ఎంఆర్పీకి మించి వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాకు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కొన్ని దుకాణాలలో స్టాకు రిజిష్టర్, బిల్స్ అప్డేట్ చేయనందున తదుపరి సరిసేంత వరకు 106.8 మెట్రిక్ టన్నుల ఎరువులు తదితరవి వాటి విలువ రూ. 37,87,042 అమ్మకాన్ని నిలుపుదల చేసినట్లు వారు వివరించారు.

చిట్వేలి: చిట్వేలిలోని దుకాణాలను మండల వ్యవసాయాధికారి సుధాకర్ తనిఖీ చేశారు. శ్రీ లక్ష్మీ శ్రీనివాస దుకాణంలో రికార్డులు సక్రమంగా నిర్వహించనందుకు మందలించారు. రికార్డులు సరిచేసి అమ్మకాలు కొనసాగించాలని సూచించారు.

సంబేపల్లెలో 'రండి కలిసి టీ తాగుదాం'

సంబేపల్లె, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తలపెట్టిన రండి కలిసి టీ తాగుదాం కార్యక్రమం విజయవంతమైనట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. గురువారం సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల అభివృద్ధి అధికారి సీఎం రామచంద్ర, మండల తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, సచివాలయ సిబ్బందితో కలిసి కార్యక్రమం నిర్వహించారు.

'మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి'

రాయచోటిటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రను పూర్తి చేసిన 72 మందికి రూ.72 లక్షలు మంజూరు చేసి ముస్లింలకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 2026లో విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారందరికీ ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేస్తారని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

రాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట కోర్టులో
E.P.No.28/24 O.S.No.82/2012

ముత్తిరెడ్డి సురేష్ రెడ్డి తండ్రి నటరాజ్, జగదంపల్లి, Rly కోడూరు Town, (Po&Mandal) పూర్వపు కడప జిల్లా ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ... DHR
Vs
కాస సాయి ప్రసన్న W/o. వెంకట శేషయ్య, రంగనాయకులపేట Rly కోడూరు Town, (Po& Mandal), అన్నమయ్య జిల్లా ... JDR

నోటీసు

పై నంబరు ఇ.పి.లోని డిక్రీ హోల్డరు JDR అయిన మీపై O.S.No. 82/2012లో పొందిన డిక్రీ అమలు నిమిత్తము పైకోర్టులో పైనంబరు EPని దాఖలు చేసినారు. వాయిదా 18-08-2025వ తేదిన ఉన్నది. ఆ దినం ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో ఖుద్దునగాని వకీలు ద్వారా గాని హాజరయి ఆక్షేపణలున్న తెల్పుకొనవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

By Order of the Court
T.Raghunath Reddy, Advocate for DHR,
Rajampet, Cell:98480 51182

రాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట కోర్టులో
O.S.No.208/2022

ముతక సుబ్బమ్మ W/o.ముతక క్రిష్ణమూర్తి, టి.అగ్రహారం, రాజంపేట (V&PO), Mandal, పూర్వపు కడప జిల్లా ప్రస్తుతము అన్నమయ్య జిల్లా ... వాది
Vs
1.దార్ల జయమ్మ D/o. దార్ల ఫకీరయ్య, ప్రకాష్‌నగర్, కడప Town & Mandal, కడపజిల్లా వగైరాలు ... ప్రతివాదులు

6వ ప్రతివాది ముతక ప్రమీల D/o.ముతక క్రిష్ణమూర్తి, W/o. అక్కి శివయ్య, టి.అగ్రహారం, రాజంపేట (V& PO) Mandal, అన్నమయ్య జిల్లాకి నోటీసు/సమను

పై నంబరు దావాలోని పై కనీన వాది మీపైన మరియు ఇతర ప్రతివాదులపై పైకోర్టులో తనను చట్ట బద్ధమైన ముతక క్రిష్ణమూర్తికి భార్యగా నిర్ధారిస్తూ తన భర్తకు రాబడిన రిటైరుమెంటు బెనిఫిట్సు తనకు మరియు మీకు చెందునట్లు మరియు ఇతరులకెవ్వరికి చెల్లించకుండా శాశ్వత ఇన్‌జంక్షన్ కోరుతూ పై దావా దాఖలు చేసియున్నారు. వాయిదా మీ హాజరు నిమి త్తము 11-08-2025 తేదిన ఉన్నది. ఆ దినం ఉ॥ 10.30 గంటలకు ఖుద్దునగాని వకీలు ద్వారాగాని ఆక్షేపణలున్న తెల్పుకొనవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

By Order of the Court
T.Raghunath Reddy, Advocate,
Rajampet, Cell : 98480 51182

'అక్షర ఆంధ్ర'పై ఒక రోజు శిక్షణ

రాయచోటిటౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): అక్షర ఆంధ్ర కార్యక్రమంపై జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం రాయచోటిలోని డైట్ కళాశాలలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య నోడల్ ఆఫీసర్ సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ సమాజంలోని వివిధ వృత్తుల్లో ఉన్న వయోజనులను అక్షరాస్యులుగా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. 2025-26 సంవత్సరానికి అన్నమయ్య జిల్లాకు 85,605 మందిని అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యం నిర్ణయించామన్నారు. దీనికి సంబంధించిన సర్వేని త్వరగా పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏపీఎంలు, సీఎంఎంలు, ఎండీవోలు, ఎంఈవోలు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి కల్పన కార్యక్రమంలోని ఏపీవోలు, జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలకు ట్యాంకు అందజేత


ట్యాంకు అందజేస్తున్న కామిశెట్టి బద్రీనాథ్

రైల్వేకోడూరు, రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శెట్టిగుంటలోని జిల్లా పరిషత్ హైస్కూలుకు వాసవీ క్లబ్ సభ్యుడు కామిశెట్టి బద్రీనాథ్ గురువారం 2 వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ట్యాంకును అందజేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ప్రతినిధి పెండ్యాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని చెప్పగానే తమ కమిటీ సభ్యుడు దీనిని అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమం లో కామిశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల కోసం ఎన్ఆర్ఐల విరాళం

పెనగలూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా పరికరాలు సమకూర్చేందుకు కాలిఫోర్నియాలో ఉంటున్న కొమ్మిరెడ్డి ప్రీతిరెడ్డి నరసింహారెడ్డి దంపతులు రూ10 వేలు విరాళం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ తెలిపారు. ఈ పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న పల్లె కృష్ణకుమారి సహకారంతో ఈ నిధులు అందాయన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోను విద్యార్థులు రాణించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు బి.హరిప్రసాద్, అన్వర్‌బాషా, పీఎల్‌వీవీ ప్రసాద్, ప్రమీల, పరిమిళ, సుదర్శన్, మహేంద్ర, ప్రసాద్, దేవమణి పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన


సూర్యఘర్‌పై మాట్లాడుతున్న సీజీఎం జానకిరాం

రాజంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ పథకంపై రాజంపేట విద్యుత్ డివిజన్ కార్యాలయంలోని అధికారులకు గురువారం సీజీఎం/పీఎంఎం జానకిరాం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ గృహ అవసరాలకు ఉపయోగించుకోవాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ఆర్.చంద్ర శేఖర్‌రెడ్డి, రాజంపేట ఈఈ ఎన్.రాజశేఖర్‌రెడ్డి, డీఈలు సురేంద్రనాథ్, భాస్కర్‌రావు, మురళీధర్‌రెడ్డి, ఏఈలు ఎంవీ చంద్రశేఖర్, కుమార్, ఈశ్వర్‌రాజు, షఫీ, శ్రీనివాసులు, యోగానందం, సుబ్రమణ్యం, కిరణ్‌కుమార్, చలపతి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరాలయంలో వరలక్ష్మి వ్రతం

గాలివీడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీలక్ష్మి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామునే శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.కుంకుమార్చన అనంతరం అమ్మవారికి చీర సారె సమర్పించనున్నట్లు వివరించారు.

10న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జిల్లాకు రాక

రాజంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ లక్ష్య సారథులుగా కార్యకర్తలను తీర్చిదిద్దడంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 10న అన్నమయ్య జిల్లా రాయచోటికి రానున్నారని, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. గురువారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలో కూటమి అభ్యర్థి కృష్ణారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఒంటిమిట్టకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అప్పటి దేవదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు రాష్ట్ర హోదా కల్పించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీలో విలీనం చేసి, జాతీయ స్థాయిలో ఒంటిమిట్టకు ఒక గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బీజేపీ రైల్వేకోడూరు అసెంబ్లీ కోకన్వీనర్ గాదెల శ్రీనివాసులు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పెనుగొండ రమణ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మాతంగ పీఠం ఏర్పాటుకు సహకారం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మాతంగ పీఠం ఏర్పాటుకు తమవంతు సాయం అందిస్తామని కేంద్ర పరిశ్రమల శాఖ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ సీర్ల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గురువారం మాతంగ పీఠాధిపతి మాతానందగిరి స్వామిని కలిసి మఠం ఏర్పాటుపై చర్చించారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి చంద్రమౌళి, మాజీ ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు వినోద్, మండల బీజేపీ అధ్యక్షుడు కొండూరు వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

భజనలు అడ్డుకుంటున్నారని భక్తుల ధర్నా


కోదండ రామాలయం ఎదుట ధర్నా చేస్తున్న భజన బృందాలు

ఒంటిమిట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయం వద్ద భజనలు చేయకుండా అడ్డుకుంటున్నారంటూ గురువారం ఆలయ దక్షిణ గోపురం వద్ద తిరుపతి అన్నమయ్య పీఠాధిపతి విజయశంకర్‌స్వామి ఆధ్వర్యంలో భక్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఆలయంలో నెల్లూరుకు చెందిన భక్తులు భజనలు చేస్తుంటే టీటీడీ అధికారులు అడ్డుకుని మైక్‌సెట్‌ను తీసుకెళ్లారన్నారు. మూడేళ్లుగా టీటీడీ వారు భజన బృందాలను అవమానిస్తున్నారన్నారు. ఇప్పటికి సుమారు 30 సార్లు ఇలా జరిగిందన్నారు. దళితులమైన తాము భజనలు చేయకూడదా అని ప్రశ్నించారు. ఎక్కడినుంచో వచ్చి సొంత ఖర్చులతో భజనలు చేస్తుంటే టీటీడీ అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. భజనలు చేసుకునేందుకు ఒక ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తామని గతంలో చెప్పిన టీటీడీ అధికారులు చెప్పారని ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. తనకు స్పష్టమైన హామీ వచ్చేవరకు ధర్నాను విరమించేది లేదన్నారు. దీంతో విజిలెన్స్ అధికారి గంగులయ్య విషయాన్ని టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టీటీడీ డిప్యూటీ ఈవో వారితో మాట్లాడారు. రేపటి నుంచి భజనలు చేసుకోమని శనివారం తాను వచ్చి మాట్లాడతానని చెప్పడంతో ధర్నాను విరమించారు. అన్నమయ్య పీఠం జిల్లా అధ్యక్షుడు సాంబయ్య, నాగయ్య, భజన బృందాల సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసేందుకు వెళితే కేసులు పెడతారా?

రాయచోటిటౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): దౌర్జన్యం చేసిన వారిని వదిలేసి పోలీసులు తనపై అక్రమంగా కేసులు పెట్టారని మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, కౌన్సిలర్ విజయమ్మ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు తమ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమకు ఆదిరెడ్డి, ముబారక్, రిటైర్డ్ డీఈ మండెం ఆదినారాయణరెడ్డి అనే వ్యక్తులతో భూవివాదం ఉందని, ఈ విషయం కోర్టులో కూడా నడుస్తోందన్నారు. ఈ మధ్య కాలంలో ఆదినారాయణరెడ్డి, అనుచరులు తమపై దౌర్జన్యం చేయగా, పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళితే, తమపైనే హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఆరోపించారు.

భారీ వర్షంతో రైల్వే కోడూరు-జలమయం


రైల్వేకోడూరు ప్రధానదారిలో వర్షపు నీరు

రైల్వేకోడూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండ లంలో గురువారం భారీ వర్షం కురవడంతో గుండాలపల్లె గ్రామంలో నాలుగు వీధులు, పలు గ్రామాలు జలమయమయ్యాయి. రైల్వే కోడూరు పట్టణంలోని ప్రధానదారి, రైల్వే స్టేషన్ రోడ్డు, పోలీస్‌స్టేషన్ వెనక రోడ్డు నీటితో నిండిపోయాయి. దీంతో దుకాణాల్లోకి నీరు చేరింది. పాదచారులు ఇక్కట్లు పడ్డారు.

పెనగలూరు: మండలంలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి తర్వాత భారీ వర్షం కురిసింది. తూర్పుపల్లె, సింగనమల, కొత్త సింగనమల ఓబిలి ప్రాంతాల్లో బీడు భూములపైన గురువారం మధ్యాహ్నం వరకు వర్షపునీరు నిలిచి ఉండగా, చుట్టుపక్కల గ్రామాల్లో అంతంత మాత్రంగానే కురవడం విశేషం. మరికొన్ని గ్రామాల్లో కనీసం జల్లులు కూడా కురవలేదు.

నేటి నుంచి రామాంజనేయాలయ కుంభాభిషేక ఉత్సవాలు

రాయచోటి టౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డీస్‌కాలనీలోఉన్న రామాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 8న వరలక్ష్మి వ్రతం, 9న ఉదయం కావలి వెంకట సుబ్బారెడ్డి, సూరపు రాజు వెంకట్రామరాజు కుటుంబ సభ్యుల సహకారంతో సీతారాముల కల్యాణం 10 న కుంభాభిషేకం, సీతారాముల పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు కావలి వెంకటసుబ్బారెడ్డి, అర్చకుడు ప్రభాకరశర్మ తెలిపారు.

టీడీపీని గెలిపించండి: దీపక్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట టీడీపీ, జడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని గెలిపించాలని టీడీపీ రాయలసీమ జోన్ కోఆర్డినేటర్ దీపక్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపిస్తే ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తాడన్నారు. ప్రభుత్వం నుంచి మండలానికి భారీగా నిధులు కూడా వస్తాయన్నారు. శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు తెలుగుదేశం ప్రభుత్వం సాగునీరు అందించిందన్నారు. మండల అభివృద్ధికి చంద్రబాబునాయుడు ఎన్నో నిధులు మంజూరు చేశారన్నారు. ఖాదీ, చిన్న పరిశ్రమలశాఖ చైర్మన్ కేకే చౌదరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుస్సేన్, జనసేనపార్టీ నాయ కుడు శ్రీనివాసరాజు, ముస్తాక్ హుస్సేన్, అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర టీడీపీ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, కల్లుగీత కార్మికుల కార్పొరేషన్ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం సాయంత్రం విస్తృత ప్రచారం నిర్వహించారు. నరవ కాటిపల్లెలో పార్టీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి రాష్ట్ర టీడీపీ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

'నవోదయం'తో ప్రజల్లో చైతన్యం

సంబేపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చి సారా రహిత గ్రామాలుగా మార్చడమే లక్ష్యమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గురుప్రసాద్ తెలిపారు. గురువారం పెద్దబిడికి, పరకలబండ బిడికి గ్రామాల్లో నాటుసారా తయారీతో కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. నాటు సారా తయారీతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దని తెలియజేశారు. ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని వివరించారు. నవోదయంతో మారుమూల ప్రాంతాలను సారారహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

10న కంటి వైద్య శిబిరం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న నలంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ బాలసుబ్రమణ్యం తెలిపారు. శ్రీమాతంగ మహాపీఠం మాతంగగిరి నందస్వామి పర్యవేక్షణలో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి వారు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజనం, ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఏడీఏ జయరాణి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సంచాలకులు జయరాణి సూచించారు. మండలంలోని 11 ఆర్ఎస్‌కే సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులకెంతో లాభదాయకమని , ప్రతి రైతు తమ పొలాల చుట్టూ దొరికే ప్రకృతి వనరులను పంట సాగులో ఉప యోగిస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఘనజీవామృతం, పంచ గవ్య, నీమాస్త్రం, సేంద్రియ ఎరువులు రైతులు తయారు చేసుకోవచ్చునన్నారు. ఏ గ్రేడ్ మోడల్ పద్ధతుల గురించి రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరబల్లి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, ఎస్ఆర్‌కే సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

రైల్వేకోడూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెలో గురువారం జన సురక్ష కార్యక్రమం కింద ఏపీజీబీ బ్యాంకు ప్రతినిధులు జ్యోత్స్న, ప్రతాప్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పథకాల్లో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా కనీసం రూ. 2 లక్షల బీమా సౌకర్యాన్ని పొందవచ్చునని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: కొర్లకుంటలో ఏపీజీబీ మేనేజర్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో సామాజిక భద్రత పథకాలపై పీఎంజేజే, ఏపీవై, పీఎంఎస్‌బీవై, కేవైసీ డిజిటల్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీమా ఉపయోగాలు, పింఛన్, ఆన్‌లైన్ మోసాలను తెలియజేశారు. బీమా లేని వారు బ్యాంకులో గానీ, ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో గానీ చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం


చేనేత కార్మికులను సన్మానిస్తున్న రాటాల రామయ్య

సిద్దవటం, ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఉప్పరపల్లె జనసేనపార్టీ కార్యాలయంలో గురు వారం ఆ పార్టీ చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య ఆధ్వర్యంలో చేనేత కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు చేనేత దుస్తులు ధరించి చేనేత పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వనుండడంతో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు, జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.

'అవార్డు బాధ్యతను మరింత పెంచింది'

సంబేపల్లె, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె సహకార సొసైటీలో 2024-25 ఏడాదికి సంబంధించి రైతులకు ఉత్తమ సేవలు అందించినందుకు సంబేపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ తరపున బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు రావడం బాధ్యతను మరింత పెంచిందని సొసైటీ అధ్యక్షుడు వంగిమళ్ల శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం సంబేపల్లె సంఘ కార్యాలయంలో సంఘ డైరెక్టర్ సుబ్బరాజు యాదవ్‌తో కలిసి సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు 2025-26 సంవత్సరానికి గానూ రైతులకు విరివిగా ఆర్థిక రుణాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో 8 మంది రైతులకు గానూ 35 లక్షల లాంగ్ టర్మ్ లోన్లు , రైతు నేస్తం రుణాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటకట్ల సాంబశివారెడ్డి, మాజీ సర్పంచ్ కాటమరాజు, రైతులు, సొసైటీ సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

'హర్‌ఘర్ తిరంగా'పై అవగాహన ర్యాలీ


హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రాయచోటిటౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించాలంటూ రాయచోటి పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా పర్యాటక శాఖ తదితర శాఖల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని డైట్ కళాశాల నుండి ఆర్టీసీ బస్టాండు వరకు అధికురులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి నాగభూషణం మాట్లాడుతూ స్వాతంత్రం యొక్క విలువలను స్మరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బైకు నుంచి కిందపడ్డ మహిళ

● పరిస్థితి విషమం ● తిరుపతి రూయాకు తరలింపు


తీవ్రంగా గాయపడ్డ శాంతమ్మ

ములకలచెరువు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహన చక్రంలో చీర ఇరుక్కుని ఓ మహిళ కింద పడ్డ సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో మహిళ పరిస్థితి విషమిం చడంతో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువుకు చెందిన పెయింటర్ వెంకటరమణ భార్య శాంతమ్మ(45)కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తన కుమారుడు వెంట ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చి ఆస్పత్రిలో చూపించుకుంది. తిరిగి ములకలచెరువుకు వస్తుండగా మార్గం మధ్యంలోని వేపూరికోట వద్దకు రాగానే వెనుక కూర్చున్న శాంతమ్మ చీర కొంగు బైక్ వెనుక చక్రంలో చుట్టుకుని కింద పడింది. ఈ ప్రమాదంలో శాంతమ్మ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు తిరుపతి రూయాకు రెఫర్ చేశారు.

కోమటివాని చెరువులో పడి వృద్ధుడు..


మద్దిరెడ్డి (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 7: కోమటివాని చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కురబకోట మండలం, తుగువారిపల్లె వాసి వెంకటరెడ్డి కుమారుడు మద్దిరెడ్డి (70) సర్కార్‌తోపులో ఉంటూ బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు సమీప బంధువులు వెదికినా ప్రయోజనం లేదు. కాగా వృద్ధుడు కోమటి వాని చెరువులో పడ్డాడు. దీన్ని గమనించిన పలువురు యువకులు ఆయనను బయటికి తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మదనపల్లె టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య వసంతమ్మ ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ శంకర్(51) మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఈ నెల 3న బండారువారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లె మండలం, వేంపల్లె హరిజనవాడ వాసి శంకర్ గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య


ఈశ్వర్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిబండ గ్రామం కొల్లవాండ్లపల్లెకు చెందిన ఈశ్వర్‌రెడ్డి (38) పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మద్యం మత్తుకు బానిసైన అతను కడుపునొప్పి భరించలేక గురు వారం ఉదయం 8 గంటలకు ఆత్మహత్యాయత్నం చేసిన ఆయనను కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు..


సబిహాభాను (ఫైల్ ఫొటో)

నిమ్మనపల్లి ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై భర్త సయ్యద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక నిమ్మనపల్లి పంచాయతీ తవళం రోడ్డుకు చెందిన సయ్యద్ ఖాన్ భార్య సబిహాభాను(22) ఇంటి వద్ద వుంటూ కుటుంబాన్ని చూసుకునేది. అయితే తాను స్థానికంగా కొయ్యలమండీ వద్ద పనులకు వెళ్లగా బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిం దని భర్త ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు ప్రభుత్వ న్యాయవాదుల తొలగింపు

కలికిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని వివిధ కోర్టుల్లో ప్రభుత్వ న్యాయవాదులుగా పనిచేస్తున్న ముగ్గురు సేవలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టులో ప్రభుత్వ న్యాయవాది (జీపీ)గా పనిచేస్తున్న పి.శివశంకర్ రెడ్డిని తొలగించింది. జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా పనిచేస్తున్న షేక్ జాకీర్ హుస్సేన్‌కు కూడా ప్రభుత్వం ఉద్వాసన చెప్పింది. బద్వేలులో వున్న రాజంపేట ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా పనిచేస్తున్న ఊరుబిండి సూర్యనారాయణ రెడ్డి సేవలను కూడా ప్రభుత్వం ఉపసంహరించింది. ఈ ముగ్గురి సేవలను పాలనాపరమైన సౌలభ్యత కోసం ఉపసంహరించాలని నిర్ణయించినట్లు విడివిడిగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

వాన నీటికి దారేదీ..?

● మోరీలకు మూత.. తారు రోడ్లకు కోత
● పొలాల వెంట గట్ల నిర్మాణం
● రైతుల చేష్టలతో రోడ్లు ధ్వంసం
● అటు వైపు చూడని రోడ్లు, భవనాలశాఖ

పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాలశాఖ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన, తదితర పథకాల కింద, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశారు. ఇందుకు రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టారు. అంతవరకూ బాగానే ఉన్నా.. తర్వాత ఆయాశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రోడ్ల పర్యవేక్షణ మరిచిపోతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న రైతులు కొందరు తమ భూమిని, పంటలను పరిరక్షించుకునే క్రమంలో వర్షపునీటికి అడ్డుకట్ట వేస్తూ, దారి మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో పొలాల వెంట నిర్మించిన బ్రిడ్జిలు, మోరీ(కల్వర్టు)లను మూసేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పల్లెలకు వెళ్లే రహదారుల్లో ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.


రోడ్డు వెంబడి మట్టితో నిర్మించిన గట్టు

మదనపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మట్టిరోడ్డయినా.. మెటల్ రోడ్డయినా.. చివరకు తారురోడ్డు అయినా.. నిర్మాణంలో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. కొత్తగా రోడ్డు నిర్మాణం ప్రతిపాదన సమయంలోనే కొలతలు, వెవలింగ్ తీసి ఎలా నిర్మించాలో నిర్ణయిస్తారు. ఇందులో భాగంగా వంకలు, వాగులు, కొండలు, గుట్టలు, పైప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటిని దారి మళ్లించే ఏర్పాటు చేస్తారు. ఈ క్రమంలో అన్నింటినీ తప్పిస్తూ, అవసరమైన చోట బ్రిడ్జిలు, మోరీ(కల్వర్టు), ఏట వాలు ప్రాంతంలో రెయిలింగ్ గోడ, రోడ్డుకు అటు, ఇటు వర్షపు నీరు వెళ్లేలా కాలువలు, అవి కోతకు గురికాకుండా రాళ్ల రివిట్‌మెంట్ పనులు చేపడ తారు. ఏ రకం రోడ్డు అయినా సరే.. ఈ చర్యలు తప్పనిసరి. పై ప్రాంతం నుంచి నుంచి తరచూ వర్షపు నీరు వస్తుందనుకుంటే అక్కడ రోడ్డు కోతకాకుండా ఉండేందుకు సిమెంటు రోడ్డు కూడా వేస్తారు.


దిగువ మిట్టామర్రి వద్ద రోడ్డు పక్కన మట్టితో కాలువను పూడ్చేసిన దృశ్యం

రోడ్లపైకి నీరు రావడంతో ప్రమాదాలు

పై ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు సులువుగా వెళ్లేందుకు రోడ్డు వెంబడి కాలువ, డైవర్షన్ నిర్మించారు. ఆ నీరు పొలాల్లోకి రాకుండా రైతులు ఎక్కడిక్కడ అడ్డుకట్ట వేసేశారు. మోరీలు మూసేశారు. కాలువలు ధ్వంసం చేసేశారు. వాటిని మట్టితో కప్పేశారు. తర్వాత రోడ్డు పొడవునా అంచుల్లో పొడవునా మట్టికట్ట నిర్మించారు. ఒకరు ఓ వైపు నిర్మిస్తే, అటు వైపు ఉన్న రైతు తానేమీ తక్కువ తిన్నానా అన్నట్లు అంతకంటే ఇంకొంచెం ఎత్తుగా మట్టికట్టలు పోసి, వర్షపునీరు పొలంలోకి రాకుండా ఎవరిపాటికి వారు దారి మళ్లించారు. ఫలితంగా ఆ నీరంతా రోడ్డు వెంబడి ప్రవహిస్తూ, రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి, వర్షపునీరు నిల్వ చేరడంతో పైప్రాంతాలకు వెళ్లాల్సిన ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పొలంలోని మట్టి, రాళ్లు రోడ్డుపైకి వచ్చి వాహన టైర్లు పంక్చర్ కావడమే కాదు.. తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

చాలా గ్రామాల్లో రోడ్లు ధ్వంసం

ఇలాంటి దృష్టాంతాలు మదనపల్లె, కురబకోట ఏరియాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. మదనపల్లె మండలం పొన్నేటిపాళెం, కోళ్లబైలు, కురబలకోట మండలం తెట్టు, అంగళ్లు, తదితర గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. కోళ్లబైలు పంచాయతీలోని సవరంవారిపల్లె, ఎగువ మిట్టామర్రి, దిగువ మిట్టామర్రి, మామిడిగుంతలపల్లె, మేకలవాండ్లపల్లె, వలసపల్లె, కోటవారిపల్లె పంచాయతీలోని బండకిందపల్లె, అడవిలోపల్లె, బొమ్మన చెరువు, టేకులపాళెం, పెంచుపాడు, మాలేపాడు బి.కొత్తకోట మండలంలోని మొటుకుపల్లె మార్గాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. వీటిలో ముఖ్యంగా రోడ్లు, భవనాలశాఖ రోడ్డే ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యపై పై ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. రోడ్లు వేయడం వరకే తమ పని అనే రీతిలో వ్యవహరిస్తున్నారు రోడ్లు భవనాలశాఖ అధికారులు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు పక్కన విలువైన స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా..రోడ్డు కబ్జాకు గురవుతున్నా.. ఆశాఖ నిద్రమత్తు వీడటం లేదు. తమకెందుకులే అదంతా రెవెన్యూశాఖ చూసుకుంటుందన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు.

వారం రోజుల్లో క్లియర్ చేస్తాం

- అరవిందదేవి, ఈఈ, రోడ్డు భవనాల శాఖ, మదనపల్లె

కోళ్లబైలు మార్గంలోని మేకలవారిపల్లె, మిటమర్రి రద్దు మార్గాలను పరిశీలిస్తాం. రోడ్డు వెంబడి వర్షపు నీటికి అడ్డంగా వేసిన మట్టి కట్టలను తొలగిస్తాం. మూసేసిన మోరీలను కూడా వారం రోజుల్లో క్లియర్ చేసి వర్షపు నీరు యథావిధిగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.


సవరంవారిపల్లె వద్ద పొలంలో మూతపడిన కల్వర్టు

టన్ను రూ.9 వేలకు తక్కువ చెల్లిస్తే చర్యలు

● బొప్పాయి దళారులకు సబ్‌కలెక్టర్ హెచ్చరిక

రైల్వేకోడూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బొప్పాయికాయలు టన్నుకు రూ.9,000లకు తక్కువ చెల్లిస్తే చర్యలు తప్పవని రాజంపేట సబ్ కలెక్టర్ భావన బొప్పాయి దళారులను హెచ్చరించారు. గురువారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో మరోసారి బొప్పాయి రైతులు, దళారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను తప్పకుండా పాటించాలన్నారు. వ్యాపారం పుంజుకుంటే ధర పెంచుకుంటూ పోవాలని తెలిపారు. టన్ను రూ.8,000లతో కొనుగోలు చేసిన దళారులపై చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని చెక్‌పోస్టుల వద్ద ఉద్యాన, రెవెన్యూ అధికారులు, పోలీసులు బొప్పాయి లారీలపై నిఘా ఉంచారని తెలిపారు. టన్ను రూ.8,000లకు తక్కువ చెల్లించిన లారీలను పట్టుకుని సీజ్ చేస్తామని తెలిపారు. ఈ నెల 15 వరకు టన్నుకు రూ.9,000లు చెల్లించాలని ఆదేశించారు. ఏఎస్పీ రామనాథ్‌హెగ్డే మాట్లాడుతూ బొప్పాయి రైతులను ఇబ్బంది పెట్టకుండా ఉండాలన్నారు. కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, మార్కెటింగ్ శాఖ అధికారులు బాబు, మనోజ్, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

బొప్పాయి ధరలపై ఉద్యానశాఖ ఆరా

రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో బుధవారం ధరలు తగ్గించారని రైతులు అధికారులకు విన్నవించడంతో గురువారం ఉద్యానశాఖ అధికారులు, అసిస్టెంట్లు తదితరులు పరిశీలించారు. బొప్పాయి లారీలు పెట్టిన ప్రతి తోట దగ్గరకు వెళ్లి ఎంత ధర చెల్లించారు, దళారీ ఎవరు, మార్వాడీ ఎవరన్న అంశాలను ఆరా తీశారని ఉద్యానశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద నిఘా పెట్టారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట సబ్ కలెక్టర్ భావన

ఏడాది పాలనలో సంతృప్తి : సబ్ కలెక్టర్

మదనపల్లెటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేరు ప్రఖ్యాతలు పొందిన మదనపల్లె రెవెన్యూ సబ్‌డివిజన్‌లో ఏడాది పాటు విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తి ఇచ్చిందని సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ చెప్పారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో మదనపల్లె రూరల్, తాలూకా, టూటౌన్ సీఐలు సబ్‌కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మదనపల్లెలో తన ఏడాది పాలనపై ఇలా వివరించారు. 2024 జూలై 26న మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న రోజుకు ముందే సబ్‌కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం జరిగిందన్నారు. అటువంటి వాతావరణంలో విధుల్లోకి చేరినప్పుడు రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరి ఆర్‌పీ సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంతో తోడ్పాటు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి కాలిపోయిన భవనాలను పునర్‌నిర్మిం చడం, కాలిపోయిన ఫైళ్లను ఆయా మండలాల నుంచి రికవరీ చర్యలను ఒక యజ్ఞంలో నిర్వహించానన్నారు. సీఎం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా 5,540 అర్జీలను విచారించి అందులో 5,140 దాకా అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. ఇక పోతే మదనపల్లెలో బక్రీద్, వినాయక చవితి పండుగల సందర్భంగా శాంతి కమిటీ సమా వేశాలు నిర్వహించి, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టా మన్నారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో వున్న 23 మంది వీఆర్ఏలకు పదోన్నతి కల్పించానన్నారు. విధుల నిర్వహణలో రాజీపడకుండా తప్పులు చేసిన రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టానన్నారు. ముఖ్యంగా మ్యుటేషన్లను మంజూరు చేయడంలో వేగవంతంగా పని చేశానన్నారు.


బదిలీపై వెళుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ మహేంద్ర, సీఐలు

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడు అరెస్టు

పెద్దమండ్యం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లి ఏడీజే కోర్టులో నడుస్తున్న చెక్‌బౌన్స్ కేసులో నిందితుడుగా ఉన్న చౌడేపల్లి అసిస్టెంట్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న షఫీక్ అహ్మద్‌ను పుంగనూరులో గురువారం పెద్దమండ్యం పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లి 2టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ అనంతరం నిందితుడిని మదనపల్లి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు. పెద్దమండ్యం పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఆయన చౌడేపల్లికు బదిలీ అయ్యారు. పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో షఫీక్ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పిడుగు పాటుకు రేకుల ఇల్లు ధ్వంసం


ధ్వంసమైన రేకుల ఇల్లు

నిమ్మనపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బండమీద హరిజనవాడలో కె.వెంకటరమణ ఇంటిపై గురువారం ఉదయం కురిసిన వర్షానికి పెద్ద శబ్ధంతో పిడుగు పడింది. దీంతో ఇంటిపైకప్పు, ఇంట్లో వున్న సామగ్రి ధ్వంసమయ్యాయి. కుటుంబీకులు వెంకటరమణ, భార్య సరోజమ్మ ఇంటి బయట ఆవులను కట్టేసేందుకు వెళ్లారు. దీంతో వారికి ఎలాంటి ఇబ్బంది కలగలేదు. పైగా గ్రామంలో వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తెగిపడింది. గ్రామంలోని పలు ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టంపై అంచనా వేశారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్ బాష తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదన పల్లె పట్టణం, శెట్టివారివీధి వాసి స్వప్న, రమేశ్‌ల కుమార్తె వైష్ణవి నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడాకారులకు రూ.లక్ష చేయూత


ఆర్థిక సహాయం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులకు అన్నమయ్య జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆర్థికంగా చేయూత ఇచ్చింది. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ చేతుల మీదుగా రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరసింహనాయుడు, ప్రధాన కార్యదర్శి ఆర్ఎం బాబ్జి కలసి రూ.లక్ష చెక్కును ఇద్దరు క్రీడాకారులకు అందజేశారు. ఇండోనేషియాలో ఈ నెల 15న నిర్వహించే పోటీలకు వెళ్లనున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు కె.కెన్నెత్, సి.సతీష్‌లు రెవెన్యూ అసోసియేషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో చైతన్య అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గురువారం స్కూటర్‌పై చౌటపల్లి నుంచి లక్కిరెడ్డిపల్లెకు వెళుతుండగా, మార్గమధ్యంలోని మర్రిచెట్టు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

చేపల వేలానికి ‘ఆధిపత్య పోరు’

● వేలం నిర్వహించరాదని గ్రామస్థుల పట్టు ● ఉద్రిక్తతల నడుమ ఎట్టకేలకు వాయిదా వేసిన అధికారులు


రాపూరివాండ్లపల్లె సచివాలయం వద్ద వేలం పాటలను వాయిదా వేస్తున్న పంచాయతీ అధికారులు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం రంగరాయ చెరువు చేపల వేలంపాటలు తీవ్ర ఉద్రిక్తతల నడుమ అధికారులు వాయిదా వేశారు. గురువారం స్థానిక రాపూరివాండ్లపల్లె సచివాలయ ఆవరణలో చేపల చెరువు వేలం పాటలను నిర్వహించేందుకు ఈఓపీఆర్డీ మోహన్‌ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి ఎర్రమల్లయ్య నాయుడు ఏర్పాట్లు చేశారు. వేలం నిర్వహణకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సరిగ్గా ఉదయం 11 గంటలకు గ్రామస్థులు పెద్దఎత్తున వేలం ప్రదేశానికి చేరుకున్నారు. పంచాయతీ అధికారులు వేలంలో పాల్గొనే వారి నుంచి ధరావత్తు సొమ్మును వసూలు చేశారు. అయితే గ్రామస్థులు పెద్ద ఎత్తున చేరుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ వేలం నిర్వహించరాదని ఈఓపీఆర్డీకి గ్రామస్థులు మూకుమ్మడిగా వినతి పత్రం సమర్పించారు. ఒకానొక సమయంలో గ్రామస్థులు అధికారుల నడుమ వాదోపవాదాలు జరిగాయి. ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని గ్రామస్థులను శాంతింపచేశారు. అనంతరం ఈఓపీఆర్డీ మాట్లాడుతూ పంచాయతీ ఆస్తులపై పంచాయతీ అధికారులకు పూర్తి హక్కు ఉంటుందని, పంచాయతీ అధికారుల నిర్ణయాన్ని గ్రామస్థులు ఆమోదించాలని కోరారు. గ్రామస్థులు మాట్లాడుతూ చెరువులో నీళ్లు తక్కువ మట్టంలో ఉన్నాయని, అలాంటప్పుడు మీరు ఎలా వేలం నిర్వహిస్తారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు తాగునీటికి జీవనాధరమైన చెరువులో నీళ్లు వదిలేసి వారు చేపలను పట్టుకుంటే మా పరిస్థితి ఏమిటని అధికారులను నిలదీశారు. గతంలో వేలం పాడిన గుత్తేదారులు వలల ద్వారా చేపలు పట్టకుండా రసాయన మందులు ఉపయోగించి చేపలను పట్టడం వలన చెరువులో నీరు పూర్తిగా కలుషితమైందన్నారు. దీంతో ఆ నీటిని మూగజీవాలు నీటిని సైతం తాగడం లేదన్నారు. ఆ రసాయనాల వలన పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ప్రజలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడ్డారు. దీంతో అధికారులు ఎట్టకేలకు వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి వేలం నిర్వహణ తేదీని ప్రకటించి వేలం నిర్వహిస్తామని తెలియచేయడంతో గ్రామస్థులు వెనుదిరిగారు. వేలం పాట నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మొలకలచెరువు సీఐ లక్ష్మన్న, పీటీఎం ఎస్ఐ హరిహరప్రసాద్ ముగ్గురు ఎస్ఐలు, 15 మంది కానిస్టేబుల్, ఇద్దరు ఏఎస్ఐలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పీలేరుపై ‘జల’కుట్ర !

● గార్గేయ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల
● పోలీసులకు ఫిర్యాదు చేసే యోజనలో అధికారులు, టీడీపీ నేతలు


తూమును పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

పీలేరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణ దాహార్తి తీర్చేందుకు నిర్మించిన గార్గేయ ప్రాజెక్టు(బాలంవారిపల్లె ప్రాజెక్టు) నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నీటిని దిగువకు విడుదల చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పీలేరు పంచాయతీకి నీటి పంపింగ్ చేసేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో జరిగిన ఈ సంఘటనతో అటు అధికారులు, ఇటు స్థానిక టీడీపీ నేతలు షాక్‌కు గురయ్యారు. ప్రస్తుతానికి నిండు కుండను తలపిస్తున్న ప్రాజెక్టులోని నీటిని దిగువకు విడుదల చేస్తే నీరు డెడ్ స్టోరేజ్‌కు చేరుకుంటుందన్న కారణంగా పంపింగ్‌ను నిలిపేయవచ్చనే చెడు ఆలోచనతోనే నీటిని విడుదల చేసి ఉంటారని అధికారులు, టీడీపీ నేతలు అనుమానిస్తున్నారు. ప్రాజెక్టులో సుమారు 6 అడుగుల మేర నీరు తగ్గిపోయిందని, ఆ నీటిని సుమారు ఏడాదిపాటు పీలేరు ప్రజలకు సరఫరా చేసి ఉండవచ్చని పంచాయతీ వాటర్ వర్క్స్ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనా వేస్తున్నారు. కేవలం రాజకీయ కారణాలతోనే ప్రాజెక్టు సమీప గ్రామాలకు చెందిన కొందరు వైసీపీ నేతలు ఈ పనికి సిద్ధపడ్డారని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

ఇది వైసీపీ కుట్రే : టీడీపీ నేతలు

ప్రాజెక్టు నుంచి నీటిని కిందికి వదిలేసిన ఘటనలో కుట్ర కోణం ఉందంటూ పీలేరు టీడీపీ నేతలు అనుమానిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాను అడ్డుకుని పట్టణంలో నీటి ఎద్దడి సృష్టించి ప్రజల ముందు ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టేందుకు వైసీపీ నేతలు కుట్ర పన్నారని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా పీలేరు పట్టణానికి తాగునీరు అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు అమరనాథరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి పేర్కొన్నారు.



చాపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

'కుందూ'లో నీటి పరవళ్లు

గత వారం రోజుల నుంచి కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పైతట్టు ప్రాంతాలలో పడిన వర్షాలతో నదిలో నీరు పరుగులు పెడుతోంది. నదిలోని నీటి పరవళ్లు చూపరులను అలరిస్తున్నాయి. ఇక నదీ తీరం వెంబడి ఉన్న గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగుకు పుష్కలంగా నీరు లభిస్తుందని సంతోషంగా ఉన్నారు. ఇప్పటికే చాపాడు, దువ్వూరు మండలాల్లో నదీ పరివాహక గ్రామాల రైతులు వరిపైరు సాగు చేసేందుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు.
(చాపాడు/దువ్వూరు, ఆంధ్రజ్యోతి)



కామనూరు బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతున్న నీళ్లు

చెట్టుకు ఉరివేసుకొని రైతు ఆత్మహత్య



మైదుకూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యల్లంపల్లె గ్రామానికి చెందిన మూలే ఇంద్రసేనారెడ్డి (41) అనే రైతు గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని యల్లంపల్లెకు చెందిన ఇంద్రసేనారెడ్డి గురువారం తన భార్యతో కలిసి పశువులకు గడ్డి మేత కోసం పొలానికి వెళ్లారు. భార్య గడ్డి కోస్తుండగా పొలంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, రైతు ఇంద్రసేనారెడ్డి తన సొంత భూమి నాలుగు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసేవాడు. పంటలు సక్రమంగా పండకపోవడంతో అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సోలార్ ఫెన్సింగ్ తగిలి వ్యక్తి మృతి



పోరుమామిళ్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సోలార్ ఫెన్సింగ్ తగిలి షాక్‌కు గురై మీసాల వెంకటేశ్ (49) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. ఖాజీపేట మండలానికి చెందిన వెంకటేశ్ 25 ఏళ్ల క్రితం బొప్పాపురం వచ్చి స్థిరపడ్డాడు. కూలీ పను లు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గురు వారం చెన్నారెడ్డిపేట గ్రామ పొలాల్లో సిద్దు శివారెడ్డి పొలం లో నీళ్లు కట్టేందుకు వెళ్లి.. ఆ పక్కనే ఉన్న గుర్విరెడ్డి పొలా నికి వేసిన సోలార్‌ఫెన్సింగ్ తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, తరుణ్‌కుమార్ అనే కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

మహిళ ఆత్మహత్య

జమ్మలమడుగు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడి గ్రామంలో గురువారం తలారి రేవతిదేవి (40) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె గత కొంత కాలంగా అనారోగ్యంతో మానసికంగా బాధపడుతుండేది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుంది. సమాచారం తెలిసిన జమ్మలమడుగు అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హైమావతి తెలిపారు.

అద్దెకు దిగి బంగారం, నగదుతో పరార్



దొంగతనం కేసులో నిందితులు నిలుచున్న వారు (ఫైల్)

లింగాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో పథకం ప్రకారం ఓ ఇంట్లో అద్దెకు దిగి బంగారు, నగదుతో భార్య భర్త పరారయ్యారు. పార్నపల్లె గ్రామానికి చెందిన కమతం రాధా ఆరు నెలల క్రితం అనంతపురానికి చెందిన మా బాష, హసీనాలకు అద్దెకు తన ఇంటిని ఇచ్చింది. మాబాష అరటికాయల లోడింగ్ పనికి వెళ్లేవాడు. అయితే బుధవారం రాధ తోటవద్దకు వెళ్లిన తర్వాత మా బాష రాధా ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి రూ.1.10 లక్షల నగదు, 9 గ్రాముల బంగారం, కాళ్ల పట్టీలు దొంగిలించి పరారయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పట్టపగలే చోరీకి యత్నం

- దొంగతో పోరాడి పట్టుకున్న ఇంటి యజమాని
- తలకు తీవ్ర గాయాలు



దొంగ చేతిలో తీవ్రంగా గాయపడ్డ నంద్యాల వెంకటసుబ్బయ్య

రాజుపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే చోరీ చేస్తున్న దొంగ ను ఓ ఇంటి యజమాని పట్టుకున్నాడు. అయితే దొంగను పట్టుకునే సమయంలో తీవ్రంగా ప్రతిఘటించి దాడి చేయడంతో ఇంటి యజ మానికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేర కు... మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో గురు వారం మధ్యాహ్నం నంద్యాల వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించాడు. అదే సమయంలో ఇంటి యజమాని వెంకటసుబ్బయ్య రావడంతో దొంగ తప్పించుకునేందుకు చూశాడు. అయితే దొంగను పట్టుకునేందుకు యజమాని ప్రయత్నించగా దాడికి పాల్పడ్డాడు. చోరీ చేసేందుకు తెచ్చుకున్న ఉలితో తలపై విచక్షణా రహితంగా పొడవడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. అయినా యజమాని వెంకటసుబ్బయ్య దొంగను పట్టుకుని కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి దొంగకు దేహశుద్ధి చేసి తాళ్లతో కట్టి పడేశారు. తలకు తీవ్రగాయాలైన వెంకటసుబ్బయ్యను 108 వాహనంలో ప్రొద్దుటూరుకు.. అక్కడ నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడ తలకు 38 కుట్లు పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నెలరోజులుగా పట్టపగలే దొంగతనాలు

నెలరోజులుగా మండలంలో టంగుటూరు, రాజుపాలెం, గాదెగూడూరు గ్రామాల్లో పట్టపగలే దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. గ్రామంలోని ప్రజలు పంట పొలాలకు వెళుతుండడంతో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడ్డారు.



పట్టుబడిన దొంగ మహ్మద్‌రఫీ



దొంగను పోలీసులకు అప్పజెబుతున్న గ్రామస్థులు

పట్టుబడిన దొంగ దువ్వూరు మండలం జిల్లెల వాసి

దువ్వూరు మండలం జిలెల్ల గ్రామానికి చెందిన మహ్మద్‌రఫీ అని, ఇతను గత కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలు చేస్తూ పట్టుబడినట్లు సమాచారం. ఇతని పై దాదాపు 20 చోట్ల దొంగతనాల కేసులు నమోదై సెంట్రల్ జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు సమాచారం. పూర్తి వివరాలు విచారించి త్వరలో వెల్లడిస్తామని ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

కలసపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలో నాలుగేళ్ల చిన్నారిపై 16 సంవత్సరాల బాలుడు అత్యాచారం చేసిన ఘటన చోటు చేసుకుంది. బాలుడు తనపక్క ఇంటిలోని చిన్నారికి మాయమాటలు చెప్పి రోజు దగ్గరకు తీసుకొని ఆడించుకునేవాడు. ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం సమయంలో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఇరుగుపొరుగువారు తల్లిదండ్రులకు తెలపడంతో బాలికను చికిత్స కోసం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై కలసపాడు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన బాలుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

దాడి ఘటనలో 10 మందిపై కేసు

కలసపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం కొండపేటలో జరిగిన దాడి ఘటనపై పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ ఆమె భర్తపై జరిగిన దాడికి సంబం ధించి పోలిరెడ్డి, చంద్రకళ, వీరమ్మ, నారాయణరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చామంతి, రమణమ్మ తదితరులపై కేసు నమోదైంది. గ్రామ కంఠంలో సర్వేనెంబర్ 11/2లో 15 సెంట్ల స్థలంపై రెవెన్యూ అధికారులతో సర్వే చేయించుకుం టుండగా తనపై తన భర్తపై దాడి చేసి కొట్టారని రాజేశ్వ రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అరటిచెట్లను నరికివేశారని...

కలసపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శంఖవరంలో కాపు దశలో ఉన్న అరటిచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారని రైతు సోమిరెడ్డి కొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు 50 అరటిచెట్లు నరికివేయడంతో రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు.

16 మద్యం బాటిళ్లు స్వాధీనం

దువ్వూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రిష్ణంపల్లె గ్రామంలో గురువారం 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బ్రాందీషాపులకు అనుబంధంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న నాగరాజు అనే వ్యక్తి దగ్గర ఈ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వైసీపీ ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తోంది : ఎమ్మెల్సీ

పులివెందుల ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో వైసీపీ గత రెండు రోజులుగా చేస్తున్న హడావుడి చూస్తే ఎన్నికల బరి నుంచి తప్పుకునేందుకు తాపత్రయం పడుతున్నట్లు స్పష్టమవుతోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పులివెందులలో ఎమ్మెల్సీ ఆయన ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండువారిపల్లెలో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడానికి కారణం వైసీపీనే అన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులు ఎన్నికల నియమావళి ప్రకారం ఇంటింటి ప్రచారం చేసుకునేందుకు ఆయా గ్రామాలను ఎప్పుడెప్పుడు ఏపార్టీ ప్రచారం చేసుకోవాలో పోలీసులు సమయాన్ని కేటాయిస్తారు. అందులో భాగంగానే బుధవారం టీడీపీ నల్లగొండువారిపల్లెలో ప్రచారం చేయాల్సి ఉంది. కానీ వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ, కొంత మంది నాయకులు నల్లగొండువారిపల్లెకు వెళ్లి మా పార్టీకి చెందిన వారితో రెచ్చగొట్టే విధంగా దురుసుగా ప్రవర్తించారన్నారు. దీంతో ఇరువర్గాలకు గాయాలయ్యాయన్నారు. అలాగే మంగళవారం సురేష్‌రెడ్డి (సైదాపురం చంటి) జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారంటే అది వైసీపీకి గానీ, టీడీపీకి గానీ ప్రత్యర్థిగానే భావించాలన్నారు. అలాంటిది టీడీపీ వారు అతనిపై దాడి చేశారనడం సరైందికాదన్నారు. సైదాపురం చంటికి గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఈ సమస్యల వలనే ఈ దాడి జరిగి ఉంటుందని స్పష్టమవుతోందన్నారు. కానీ దీన్ని కూడా టీడీపీవారే దాడి చేశారనడం ఎంత వరకు సబబు అన్నారు. రాచమల్లు ప్రసాదరెడ్డి వచ్చీ రాగానే ఓ స్క్రిప్టు ప్రకారం వ్యవహారం నడుపుతున్నారన్నారు. కావాలనే ఉద్రిక్తత పరిస్థితులు వచ్చేలా రెచ్చగొట్టే కార్యక్రమాలకు దిగుతున్నారన్నారు. ఎన్నికల కోడ్ ఉన్న వందలాది మందిని తీసుకొని ఎంపీ అవినాశ్‌రెడ్డి తదితరులు పట్టణంలో ర్యాలీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. బుధవారం రాత్రి ఇ.కొత్తపల్లెకు చెందిన బాల గంగిరెడ్డి అనే వ్యక్తి టీడీపీకి చెందిన రాజాపై దాడి చేయడం వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు.

పూర్తి భద్రత మధ్య జడ్పీటీసీ ఎన్నికలు

- ఇప్పటి వరకు 120 మందిపై కేసు నమోదు
- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్టలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలు కట్టుదిట్ట భద్రత మధ్య నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. కడప పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్టలో 12న ఎన్నికలు జరుగుతున్నాయని, 14న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఇప్పటికే కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామన్నారు. అయినప్పటికీ రెండు సంఘటనలు జరిగాయి. సభ్యులు వారికి కేటాయించిన గ్రామాల్లో మాత్రమే ప్రచారం చేయాలన్నారు. అలాకాకుండా అనధికారికంగా వేరే గ్రామాలకు వెళ్లి ప్రచారం చేయడం సరికాదన్నారు. వేల్పుల గ్రామంలో నాగేంద్ర అనే వ్యక్తి వైసీపీ నుంచి టీడీపీకి రావడం జరిగిందని.. ఈ క్రమంలో ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలు నాగేంద్ర ఇంటికి వెళ్లిన సందర్భంలో ఇరువర్గాలు గొడవ పడి ఒకరి మీద ఒకరు కేసులు పెట్టుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించి పులివెందుల, ఒంటిమిట్టలో ఇప్పటి వరకు 120 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ని ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని, లేదంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మొబైల్, పెట్రోలింగ్ పార్టీస్, స్ట్రైకింగ్ ఫోర్సెస్‌తో భద్రత ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సుమారు 600 మందితో 12వ తేదీ ఎన్నికల సమయంలో భద్రత కల్పిస్తున్నామన్నారు. సీసీ కెమెరాలు, రిజర్వు ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. డ్రోన్లద్వారా కూడా పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఎవరు కూడా హోటల్స్, లాడ్జిలలో ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గండికోటలో జరిగిన విద్యార్థిని హత్యకు సంబంధించి మాట్లాడుతూ ఇంకా ఎవిడెన్స్ సేకరణ జరుగుతుందని టెక్నికల్‌గా పూర్తిస్థాయిలో విచారణ కొనసాగిస్తున్నామని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెం ట్ అండ్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహమ్మద్ పేర్కొన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డైరక్టరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రిటైర్ అయిన వారికి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులను వెంట నే చెల్లించాలని, పెన్షనరీ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని, పీఆర్‌సీ ఎరియర్స్ డీఆర్, ఈహెచ్‌ఎస్ బకాయిలను చెల్లించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. సంఘం బలోపేతానికి రాయలసీమలోని నాలుగు జిల్లాలకు జోనల్ కో-ఆర్డినేటర్‌గా రిటైర్డ్ ఇంజనీర్ షేక్ హబీబ్‌ను నియమించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగాచార్యు లు, జిల్లా అధ్యక్షుడు కేశవులు, రిటైర్డ్ ఎంపీడీవోలు, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వ్యవహారాల సభ్యుడిగా తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవ హారాల సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి నియామకమయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి ఠాకూర్ చైర్మన్‌గా 24 మంది సభ్యులున్న కమిటీలో తులసిరెడ్డిని నియమించడం హర్షనీయమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం తులసిరెడ్డిని శాలువ, పూలమాలలతో సత్కరించారు.

10న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జిల్లాకు రాక

రాజంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్య సారథులుగా కార్యకర్తలను తీర్చిదిద్దడంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 10న అన్నమయ్య జిల్లా రాయచోటికి రానున్నారని, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్ నాయుడు పిలుపు నిచ్చారు. గురువారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలో కూటమి అభ్యర్థి కృష్ణారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఒంటిమిట్టకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అప్పటి దేవదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు రాష్ట్ర హోదా కల్పించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీలో విలీనం చేసి, జాతీయ స్థాయిలో ఒంటిమిట్టకు ఒక గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బీజేపీ రైల్వేకోడూరు అసెంబ్లీ కోకన్వీనర్ గాదెల శ్రీనివాసులు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పెనుగొండ రమణ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో రైల్వే కోడూరు జలమయం

రైల్వేకోడూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండ లంలో గురువారం భారీ వర్షం కురవడంతో గుండాలపల్లె గ్రామంలో నాలుగు వీధులు, పలు గ్రామాలు జలమయమయ్యాయి. రైల్వే కోడూరు పట్టణంలోని ప్రధానదారి, రైల్వే స్టేషన్ రోడ్డు, పోలీస్‌స్టేషన్ వెనక రోడ్డు నీటి తో నిండిపోయాయి. దీంతో దుకాణాల్లోకి నీరు చేరింది. పాదచారులు ఇక్కట్లు పడ్డారు.

డాక్టర్ వైఎస్సార్ వర్సిటీ ఆర్కిటెక్చర్ కోర్సుకు సీఓఏ ఆమోదం

- హామీని నెరవేర్చిన మంత్రి లోకేశ్
- విద్యార్థి సంఘాల పోరాటాల ఫలితం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కడప డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) 2025-26 విద్యా సంవత్సరానికి 40 మంది విద్యార్థులతో ఐదు సంవత్సరాల పూర్తి సమయం బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డిగ్రీ కోర్సును అందించడానికి ఆమోదం తెలిపింది. బుధవారం (ఆగస్టు 6వ తేదీ) కౌన్సిల్ రిజిస్ట్రార్ ఆర్‌కే ఓబెరాయ్ డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌కు ఒక ప్రకటన విడుదల చేశారు. సీఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఇటీవలి సమావేశంలో, డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం కడప సమర్పించిన సమ్మతిని సమీక్షించిందని తెలిపారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా కడపలోని సంస్థలో చేరిన 2020-21 విద్యా సెషన్‌కు 64 మంది విద్యార్థులు, 2021-22కు ఆరుగురు విద్యార్థులు, 2022-23కు 15 మంది విద్యార్థులతో కూడిన బి.ఆర్క్ బ్యాచ్‌లను గుర్తించాలని.. అలాగే సంస్థ ద్వారా గుర్తింపు పొందిన అర్హత ఉన్న విద్యార్థుల దరఖాస్తులను స్వీకరించిన తర్వాత ఆర్కిటెక్ట్‌గా నమోదు చేసుకోవాలని కమిటీ నిర్ణయించింది. నిబంధనల ప్రకారం కౌన్సిల్ సూచించిన అర్హతను నెరవేర్చడానికి లోబడి ఉంటుంది. నమోదు సంఖ్యల జారీ ప్రక్రియ కోసం ఈ విద్యార్థుల డేటాను కౌన్సిల్ వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో సమర్పించాలని కూడా సంస్థను కౌన్సిల్ కోరింది.

విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి...

కడప ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులు యూనివర్సిటీలో గుర్తిం పు విషయమై ఎదుర్కొంటున్న సమస్యలపట్ల విద్యార్థి సంఘాల ఆందోళన చెందడంతో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి విషయం తెలుసుకొని శ్రీసత్యసాయి జిల్లా కొత్త చెరువు గ్రామంలో యూనివర్సిటీ విద్యా ర్థులను తీసుకెళ్లి నారా లోకేశ్‌తో మాట్లాడించడం జరిగింది. కడప ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థులు తమ సమస్యలను మంత్రి కి వివరించడం జరిగింది. ఇందుకు లోకేశ్ సానుకూలంగా స్పందించి అన్ని విషయాలను సీఓఏ (కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్)తో చర్చి స్తు న్నామని విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని స్పష్టం చెప్పారు. ప్రస్తుతం మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చిందని చెప్పవచ్చు.

విద్యార్థి సంఘాల పోరాటాల ఫలితం

డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీకి స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌కు సీఓఏ అనుమతి మంజూరు చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జూలై రెండో తేది నుంచి 8 రోజుల పాటు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళనలకు ఏఐఎస్ఎఫ్‌తో పాటు మరికొన్ని విద్యార్థి సంఘాలు కూడా తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఆందోళనలో భాగస్వామ్యం అయ్యాయి. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు విద్యార్థి సంఘాలు ఆందోళనలను విరమించాయి.



యూనివర్సిటీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం (ఫైల్)

పలు పార్టీల మద్దతు

విద్యార్థి సంఘాల ఆందోళనలకు పలురాకీయ పార్టీలు మద్దతును ప్రకటించాయి. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి విద్యార్థుల ఆందోళనలకు తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. అలాగే ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ పక్షాన మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విద్యార్థుల ఆందోళనలకు తమ మద్దతును తెలియజేశారు. విద్యార్థుల నిరసన కార్యక్రమంలో పాల్గొని సీఓఏ మంజూరు చేయాలంటూ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

చీరలు టీటీడీ కొనుగోలు చేసేలా కృషి చేస్తాం

చేనేత దినోత్సవంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



చేనేత ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో చేనేతలు నేసే పట్టుచీరలకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు కొనుగోలు చేసేలా టీటీడీ ఛైర్మన్‌తో చర్చిస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భరోసా ఇచ్చారు. గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టరేట్ వరకు చేనేత కార్మికులు, మగ్గాల యజమానులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించిందన్నారు. సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన చేనేత సదస్సులో జిల్లా హ్యాండ్‌లూమ్ ఏడీ పవన్‌కుమార్‌రెడ్డి సంక్షేమ పథకాలను వివరించారు. సీనియర్ చేనేత కార్మికులు మోహన్‌రెడ్డి, వెంకటస్వామి, సుబ్బయ్యను సన్మానించారు. కార్యక్రమంలో డీఓ ప్రవీణ్‌కుమార్‌రాజు, చేనేత రంగానికి చెందిన రాటకొండ శ్రీనివాసులు, మెడెం సిద్దప్ప, నీలకంఠ, నాగరాజు, చలపతి, చేనేత టీడీపీ నేతలు ఆర్‌జే వెంకటేశ్, కమలమరి కృష్ణ, బొమ్మిశెట్టి పురుషోత్తం, మధుబాబు, కార్మిక నేతలు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలి

మదనపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వృత్తి ఏదైనా నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించి అభివృద్ధి, సంక్షేమానికి సహకరించాలని ఆదాయపన్నుశాఖ అధికారి మహమ్మద్ ఫారూఖ్ సూచించారు. పట్టణంలో గురువారం జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పన్ను సకాలంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన శ్లాబ్ మేరకు ఆదాయం ఉండి పన్ను చెల్లించకపోతే ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. నిర్ణీత సమయంలో అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించడం వల్ల సెక్షన్ 234బీ, 234సీ ప్రకారం వడ్డీ ఉండదన్నారు. ఏఐఎస్ పోర్టల్ వినియోగంపై ఇన్‌కంట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సూర్యబాబు నాయక్ వివరించారు. కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు ప్రసాద్, చైతన్య, ట్రేడ్ అసెసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు



సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు జ్ఞాపిక అందిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు పుర ప్రముఖులు, అధికారులు, రెవెన్యూ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం సబ్‌కలెక్టరేట్‌లో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్‌ను సన్మానించి శ్రీవేంకటేశ్వరుని కొయ్య ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులు డీఏఓ నిర్మలాదేవి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్‌కు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ నేతలు నరసింహనాయుడు, ఆర్‌ఎం బాబ్జి, డీఏలు వెంకటరమణనాయుడు, లక్ష్మీనారాయణ, ఇమ్రాన్, సాయి, గురుప్రసాద్, శ్రీకాంత్, కుమారి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల సంస్కృతిని కాపాడాలి

పీలేరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు తల్లి పాలు పట్టే సంస్కృతిని కాపాడాలని తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల సిబ్బందికి పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ సూచించారు. తల్లి పాల వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఏరియా ఆస్పత్రిలో తల్లి పాల ప్రాధాన్యతపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం తల్లిపాలలో ఉండే పోషకాలు, వాటి లభ్యత కారణంగా పిల్లల్లో ఉండే ఎదుగదల, పోతపాలు కారణంగా ఏర్పడే ప్రతికూల ప్రభావాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ సరస్వతి, వైద్యులు శివయ్య, చంద్రశేఖర్ నాయక్, రాధామాధవి, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే సీఎం ధ్యేయం

వాల్మీకి పురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమమే సీఎం నారా చంద్రబాబు ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పాతమంచూరు వాసి ఎం.గరుడప్పకు సీఎం సహాయ నిధి మంజూరైన రూ.85వేలు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. నేతలు మనోహర్, లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్, మనోహర్‌రెడ్డి, నరేష్‌కుమార్, చంద్రశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు సంక్షేమం అందివ్వాలని వినతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో 11వ జాతీయ చేనేత దినోత్సవ సమావేశంలో చేనేత కార్మికులకు సంక్షేమం అందివ్వాలని కార్మిక యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌కు చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. చేనేత కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, చేనేత ప్రాంతాల్లో మెగా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని, చేనేత బ్యాంక్ అవసరమని, ముద్ర రుణాలు విరివిగా ఇవ్వాలని, చేనేత చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు బీమా అమలు చేయాలని, బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కోరారు.

కిటకిటలాడిన మదనపల్లె మార్కెట్

- పూజా సామగ్రి, పూలు, పండ్ల ధరలకు రెక్కలు
- కన్నెర్ర జేసిన కనకాంబరాలు
- మాడు పగలకొట్టిన టెంకాయలు



జనంతో క్రిక్కిరిసిన బెంగళూరు బస్టాండ్

మదనపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సర్వ శుభాల మాసం శ్రావణమాసం నేటి శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకగా నిర్వహిస్తున్నారు. మహిళలు ప్రత్యేకించి పండ్లు, పూలు, వ్రతానికి కావల్సిన సామగ్రిని తెచ్చుకోవడంలో మునిగితేలిపోయారు. వస్త్ర దుకాణాలు, పూలు, పండ్ల మండీలు మహిళలతో కిటకిటలాడాయి. పూజా సామగ్రిలో భాగమైన అమ్మవారి ముఖాలు, ముందస్తుగా తయారైన వేదికలు, మందహాసాల కొనుగోలుతో మార్కెట్ సందడిగా బిజీబిజీగా తయారయ్యాయి. గురువారం ఉదయం నుంచీ వ్యాపార సముదాయాలు, రోడ్లు, ప్రజలతో కిటకిటలాడాయి. పలువురు రోడ్లపైనే మామిడి ఆకులు, అరటి బోదెలు, పండ్లు, పూల వ్యాపారం నిర్వహించారు. మదనపల్లెలోని బెంగళూరు బస్‌స్టాండ్, చిత్తూరు బస్ స్టాండ్, నెహ్రూ బజార్, ఆర్‌ఆర్ వీధి, పలు వ్యాపార కేంద్రాల్లో నిలుచునేందుకు కూడా స్థలం లేదంటే అతిశయోక్తి కాదు. మదనపల్లె నుంచి వివిధ ప్రాంతాలకు పూలు రవాణా జరుగుతాయి కాబట్టి బుధవారం నుంచే వాటి ధరలకు రెక్కలొచ్చాయి. చామంతి పూలు బుధవారం మధ్యాహ్నమే కిలో రూ. 100కు అమ్మారంటే ఇక్కడ వ్రతం వ్యాపారం ఏమేరకు సాగి ఉంటుందో అర్థమవుతోంది.

సామగ్రి ధరలకు రెక్కలు

వరలక్ష్మీ వ్రతం పూజా సామగ్రి ధరలకు రెక్కలు వచ్చాయి. బుధవారం మధ్యాహ్నం పూల ధరలు వందల్లో పలికాయి. గురువారం సాయంత్రానికి వాటి ధరలకు రెక్కలు వచ్చి రెండు మూడింతలు పెరిగాయి. అరటికాయలు డజన్ వంద, ఆపిల్ కిలో రూ. 300 నుంచి రూ. 400 వరకు పలికాయి. కొబ్బరి కాయలు జత రూ.150 పలికాయి. చెరుకు గడ రూ.100కు అమ్ముడు పోయింది. తోరణాలు రెండు మామిడి మండలు కట్టి రూ. 50 వరకు వసూలు చేశారు. అరటి బోదెలు సైజును బట్టి రూ. 50 మొదలు 150 వరకు జరిగింది. తమలపాకులు సట్ట మూడు వందలే. అయినా కూడా పూజా సామగ్రి కొనుగోళ్లకు మహిళలు బారులు తీరారు. చివరకు కన కాంబరాలు దిగుమతి లేదని కొన్ని దుకాణాలు మూసేశారు. పండుగను ఆసరాగా చేసుకుని మరింతగా పూలధరలు పెంచేశారు. దీంతో చేసేదేమీ లేక వ్యాపారులతో బేరాలాడి కొనుగోలు చేస్తున్నారు మహిళలు.



మదనపల్లెలో పూల విక్రయం



అరటి బోదెల కొనుగోలు

సందడిగా కూడళ్లు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు పట్టణం నుంచే కాక చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు మదనపల్లె చేరుకున్నారు. ఫలితంగా చిత్తూరు బస్టాండ్, బెంగళూరు బస్టాండ్, సంతగేట్‌లో జనం క్రిక్కిరిసిపోయారు. ఒక్కసారిగా జనం అధికంగా రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు



పీలేరులో పూలదుకాణాల వద్ద సందడి



పీలేరులో టెంకాయల కొనుగోలు

పట్టణంలో పలు చోట్ల, ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహకులు తెలిపారు. రెడ్డెప్ప నాయుడు కాలనీలో మిట్స్ కళాశాల యాజమాన్యం వరలక్ష్మీ పూజకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. చౌడేశ్వరీదేవి ఆలయం, కోర్టులో గంగమ్మ ఆలయం, రాజరాజేశ్వరీదేవి ఆలయం, కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఏర్పాట్లు చేశారు.

పీలేరులో వరలక్ష్మి వ్రతం సందడి

పీలేరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పీలేరులో గురువారం సాయంత్రం వరలక్ష్మి వ్రత సందడి నెలకొంది. తెలుగింటి ఆడపడుచులు అత్యంత శాస్త్రోక్తంగా చేసుకునే వరలక్ష్మి వ్రతం కోసం కావాల్సిన పూజా సామగ్రి, ఇతర నిత్యావసరాల కోసం గురువారం మధ్యాహ్నం నుంచి పెద్దఎత్తున మహిళలు దుకాణాల వద్దకు చేరుకోవడంతో పట్టణంలో సందడి ఏర్పడింది. పట్టణంలోని ఎల్‌బీఎస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, వస్త్ర, పూల దుకాణాలు, పూజా సామగ్రి, దుకాణాలు మహిళలతో కిటకిటలాడాయి.

దుష్ప్రచారాలపై డీఎస్పీకి ఫిర్యాదు

తంబళ్లపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్ష పదవి రూ.10లక్షలకు అమ్ముడు పోయిందని కొందరు సోషల్ మీడియా, వాట్సాప్‌లో చేస్తున్న దుష్ప్రచారాలు అవాస్తవాలని టీడీపీ నేతలు అన్నారు. టీడీపీ ఇన్‌చార్జికి, సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, అబ్బర్వర్ రెడ్డప్పపై బురద చల్లేందుకే కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. మండల అధ్యక్షుడి నియామకం అబ్జర్వర్ల చేతిలో లేదని, వారు మండలంలో ఉన్న గ్రామ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, సీనియర్ నేతలు, కార్యకర్తల అభిప్రాయాల మేరకు అధిష్టానానికి నివేదికలు పంపుతారన్నారు. పరిశీలన అనంతరం టీడీపీ ఇన్‌చార్జి, సీనియర్ నేతల సూచనలతో అధిష్టానం మండల అధ్యక్షుడిని నియమిస్తుందన్నారు. ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఉన్నత చదువులు చదివారని, ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదిగి పుట్టిన గడ్డను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఈ విషయమై మదనపల్లె డీఎస్పీకి పిర్యాదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీష్ తెలుగు యువత నరసింహులు, పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలి

పీలేరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పీలేరు ఎంపీడీఓ శివశంకర్ అధికారులను ఆదేశించారు. నులిపురుగుల నివారణ దినోత్సవ సన్నాహకాలపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. 12వ తేదీన జరిగే కార్యక్రమానికి అందరినీ సన్నద్ధులను చేయాలన్నారు. మండలంలోని అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్-400 మాత్రలను తగిన మోతాదులో అందరికీ అందించాలన్నారు. వైద్యాధికారులు చంద్రశేఖర్ నాయక్, రాధా మాధవి, సీహెచ్‌ఓ సరస్వతి, డిప్యూటీ హెచ్‌ఈఓ కొండయ్య, సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్యాపకుల డిమాండ్లను పరిష్కరించాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వ అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మలిగి రాఘవరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లో అధ్యాపకులు వేర్వేరుగా నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు ఉత్తర్వుల మీద ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ఎయిడెడ్ కళాశాలలకు పంపాలన్నారు. జీఓ నెంబర్ 42ను రద్దు చేయాలన్నారు. అధ్యాపకులకు రీడిసిగ్నేషన్ జీఓను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ శ్రీదేవి, మోహనవల్లి, వి.గుగుమూర్తి, విష్ణుప్రియ, శ్రీనివాసులు, చిన్నారెడ్డి, బోధనేత సిబ్బంది కరీం, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వరలక్ష్మీ వ్రతం వేడుకలు

వాల్మీకిపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు వైభవంగా జరగనున్నాయి. కోనేటివీధిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయం, ధర్మపథం సమూహాలయం, చింతపర్తి వాసవీ అమ్మవారి దేవాలయంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఆలయాల్లో ఏర్పాట్లు, సర్వం ముస్తాబు చేశారు. ఆలయంలో వరలక్ష్మీ వ్రతం, సర్వాభీష్ట సిద్ధికి అష్టలక్ష్మి హోమం, విశేష పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. పట్టణంలో ఇంటింటా వరలక్ష్మి వ్రతం వైభవంగా చేసుకోనున్నారు.

'విచారణ చేయించండి'

మదనపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మొలకలదిన్నె ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్లాట్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ చేయించాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలోని ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జోనల్ మేనేజర్, ఇతర అధికారులు వ్యవహరించారని ఛైర్మన్, డైరెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటాయింపును రద్దు చేసి కమిటీ ద్వారా విచారించి అర్హులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

జడ్పీహైస్కూల్‌లో దరఖాస్తుల స్వీకరణ

బి.కొత్తకోట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో దివ్యాంగులు, వయోవృద్ధులకు పరీక్షలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం అర్హత పొందిన వారికి సంబంధిత పరికరాలను త్వరలో అందిస్తారు.

పరికరాలను అందజేస్తాం

కురబలకోట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన పరికరాలను అందజేస్తామని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. అంగళ్ళు జడ్పీ హైస్కూల్‌లో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల ఎంపిక కోసం సమావేశం నిర్వహించి నమోదు చేశామన్నారు. వీరికి గుర్తింపు కార్డు, అవసరమైన పరికరాలను అందజేయనున్నారు. మండల ప్రత్యేకాధికారి వాణి, ఎంఈఓ ద్వారకనాథ్, వెలుగు ఉదయ్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యల నుంచి విముక్తి కల్పించండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

బి.కొత్తకోట, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రీసర్వే పేరుతో తమ భూములకు పట్టిన దుర్గతి నుంచి ఎప్పుడు విముక్తి కల్పిస్తారంటూ బయప్పగారిపల్లి గ్రామస్తులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. రెండేళ్లగా తిరుగుతూనే వున్నా అదిగో ఇదిగో అంటున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదన్నారు. టమోటా సేద్యంలో రైతులు బిజీగా వుండగా రీసర్వే చేశారని, ఇష్టానుసారం రికార్డులు తారుమారు చేశారన్నారు. దీంతో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయని, ప్రభుత్వ పథకాలు దూరం అవుతున్నాయన్నారు. తహసీల్దార్ బాధిత రైతులతో మాట్లాడుతూ రీసర్వే సమస్యపై వచ్చిన అర్జీలను పరిశీలించి సరిదిద్దుతున్నామన్నారు.

వైద్య సాయం ఆపన్నులకు వరం

కలికిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్నులకు వరమని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ ఏడాది సీఎం సహాయ నిధి పంపిణీ రూ.2 కోట్లు దాటిందని చెప్పారు. గురువారం నగరిపల్లెలో పలు మండలాల్లో బాధితులకు మంజూరైన రూ.26 లక్షల సీఎం సహాయ నిధుల చెక్కులను, మంజూరు పత్రాలను ఆయన బాధితులకు నేరుగా పంపిణీ చేశారు. కలికిరి సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, వాల్మీకిపుర ఏఎంసీ మాజీ అధ్యక్షుడు కంభం నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ రెడ్డి, సత్యమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి, కలకడ టీడీపీ నేత శ్రీనివాసులు రెడ్డి, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె అభివృద్ధికి సహకరించండి

- మంత్రి మనోహర్‌తో జనసేన ఇన్‌చార్జి సాయినాథ్



ములకలచెరువు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని నియోజకవర్గ జనసేన పార్టీ పోతుల సాయినాథ్ కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హస్తకళ కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి గురువారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. నామినేటెడ్ పదవులు, నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

క్రీడా మైదానాన్ని కాపాడండి

తంబళ్లపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని దురాక్రమణల నుంచి కాపాడాలని టీడీపీ నేతలు, స్థానికులు కోరారు. గురువారం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేసిన వారు మాట్లాడుతూ కళాశాల మైదానాన్ని స్థానికులు కొందరు సొంత అవసరాలకు ఆక్రమించుకున్నట్లు తెలిపారు. దీని వలన మైదానం విస్తీర్ణం చాలా వరకు తగ్గి విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కళాశాల మైదానాన్ని సర్వే చేయించి దురాక్రమణల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నేతలు చంద్రశేఖర్, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు, టైలర్ శీన, దళిత నేతలు ఐసులకిట్ట, రెడ్డప్ప, అమరనాథ్ పాల్గొన్నారు.


ఇళ్ల నిర్మాణాల వేగం పెంచండి : హౌసింగ్ పీడీ

పీలేరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'మన ఇళ్లు మన గౌరవం'లో భాగంగా గూడులేని నిరుపేదల ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని అన్నమయ్య జిల్లా హౌసింగ్ పీడీ రమేష్‌రెడ్డి ఆదేశించారు. గురు వారం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో అనుకున్న మేరకు పురోగతి సాధించలేదన్నారు. జిల్లాలో ఏ నియోజక వర్గానికీ లేని విధంగా పీలేరుకు అత్యధి కంగా ఇళ్లు మంజూరు చేసినా నిర్మాణాల ప్రగతి లక్ష్యం సాధించలేక పోయామన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బీఎల్, ఆర్‌ఎల్, ఆర్‌సీ స్టేజీల్లో నిర్మాణాలు ఉన్నాయని, వీటి నిర్మాణాలు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. మార్చి 26 నాటికి ఇళ్ల నిర్మాణాలు వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శివశంకర్, హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ రమణయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నిర్మాణాలను పూర్తి చేయించాలి

కలకడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని హౌసింగ్ పీడీ రమేష్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీఓ జగదీశ్వర్, డీఈ రమణయ్య, సిబ్బంది ప్రతాప్ పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఘన నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన పీలేరు మాజీ సర్పంచ్ ఏ.ఎస్. హుమయూన్, వారి సోదరుడు షాజహాన్ బాషకు పంచాయతీ వార్డు సభ్యులు నివాళులర్పించారు. గురువారం సాయంత్రం పీలేరు పంచాయతీ కార్యాలయంలో హుమయూన్ సోదరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి కొంతసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు విక్టరీ వెంకట్రమణారెడ్డి, శ్రీనాథరెడ్డి, అబిద్, సాంబశివారెడ్డి, కాలేషా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

108మందికి కంటి పరీక్షలు

వాల్మీకిపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 108మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే 38మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, సిబ్బంది పవిత్ర, వాసవి, దిలీప్, రమణయ్య పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం మంజూరు చేయించండి

గుర్రంకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తరిగొండ జడ్పీహైస్కూల్‌లో టెన్త్ పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేయించాలని టీడీపీ నేతలు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కోరారు. కలికిరిలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. పాఠశాల్లో పరీక్ష కేంద్రం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అనువుగా కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు.